శాకంబరీ శరణం

ఇంద్రకీలాద్రిపై ముగిసిన శాకంబరీ ఉత్సవాలు



ఇంద్రకీలాద్రిపై మూడు రోజుల పాటు ఘనంగా జరిగిన శాకంబరీ ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. మూడో రోజు కూడా భక్తులు భారీగా తరలివచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు. మహా పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికారు.

6

ఇసుక కొడుతున్న సలు సక వ్యాపారం

బందరు నార్త్ మండలంలో యథేచ్ఛగా తవ్వకాలు

రెండు రోజుల కిందట అక్రమార్కుల రహస్య సమావేశం

బందరు నార్త్ మండలంలోని ముడా భూముల్లో అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వైసీపీ నాయకులతో కూటమి నేతలు జతకలిసి యథేచ్ఛగా మట్టిని అమ్ముకు తింటున్నారు. ఏకంగా రెండు రోజుల కిందట అంతర్గత సమావేశం ఏర్పాటు చేసుకుని పార్టీ చేసుకోవడమే కాకుండా, ఇసుక అక్రమ రవాణాపై తీర్మానాలు కూడా చేసుకున్నారు. ఆదాయ, వ్యయాలపై లెక్కలు గట్టారు. రానున్న రోజుల్లో కూడా ఐకమత్యంగా ఉండి, రోజువారీ ఆదాయం తెచ్చి పెడుతున్న ఇసుక దందాను కొనసాగించాలని నిర్ణయించారు.

- వైసీపీ నాయకులతో కలగలిసిన కూటమి నేతలు
- వచ్చిన సొమ్మును సమంగా పంచుకోవాలని తీర్మానం
- పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు నార్త్ మండలంలోని ముడా, ప్రభుత్వ భూములు 600 ఎకరాల్లో నుంచి ప్రభుత్వానికి ఒక్క రూపాయి సీనరేజీ చెల్లించకుండా ఇసుకను తవ్వేస్తున్నారు. వైసీపీ హయాంలో ఇసుకను తవ్వి విక్రయించడంలో అనుభవం ఉన్న వారితో కొందరు కూటమి నాయకులు కలిశారు. వీరంతా కలిసి ప్రభుత్వ భూముల నుంచి ఇసుకను తవ్వి లోడ్ చేసినందుకు టిప్పర్‌కు రూ.4,500, ట్రాక్టర్‌కు రూ.500 వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ భూములను తమ సొంతంగా భావించి ఇంత పెద్దమొత్తంలో వ్యాపారం చేస్తున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు కన్నెత్తి చూడట్లేదు. బందరు పోర్టుకు మెటీరియల్‌ను రవాణా చేసే రహదారి వెంబడి పగలు, రాత్రి తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్లు తరలిపోతున్నా పట్టించుకునేవారు లేరు.

చేతివాటాలపై అంతర్గత సమావేశం

ఇసుక అక్రమ రవాణా చేసే వారంతా రెండు రోజుల క్రితం మంగినపూడి బీచ్‌కు వెళ్లే రహదారి వెంబడి ఉన్న ఓ అమ్మవారి గుడి సమీపంలో సమావేశం నిర్వహించారు. కరగ్రహారం, గోపువానిపాలెం, తపశిపూడి, మంగినపూడి ప్రాంతాల్లో ఎక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టినా, అందరం ఒకే ధరకు విక్రయించాలని నిర్ణయించారు. లెక్కలు మాత్రం కచ్చితంగా ఉండాలని, వారం చివర్లో లెక్కలు చూసుకుని, ఎవరి వాటాలు వారికి ఇవ్వాలని, ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవద్దని ఒప్పందం చేసుకున్నారు. ఓ నాయకుడు అధికారులతో మాట్లాడతాడని, అతను చెప్పినట్టుగా నడుచుకోవాలని ఏకంగా తీర్మానం చేయడం గమనార్హం.





మంగినపూడి బీచ్ రోడ్డు వెంబడి టిప్పర్లతో ఇసుకను తరలిస్తూ.., (ఇన్‌సెట్‌లో) చినయాదరలో తుమ్మాచెరువు నుంచి టిప్పర్లతో తరలింపు

వైసీపీ, కూటమి నాయకుల్లోని ఒక సామాజికవర్గానికి చెందిన వారు ఈ సమావేశంలో పాల్గొని దందా యావత్తూ వారి చేతుల్లోనే నడవాలని, వేరెవరినీ రానివ్వకుండా అడ్డుకోవాలని హుకుం జారీ చేశారు. దీనిపై కొందరు కూటమి మిగతా 6లో..

చినయాదరలో వేగవంతం

పెదయాదర పంచాయతీ శివారు చినయాదరలోని తుమ్మాచెరువు నుంచి మట్టి అక్రమ తవ్వకాలను రెండు రోజులుగా వేగవంతం చేశారు. గతంలో ట్రాక్టర్ల ద్వారా మాత్రమే మట్టిని తరలించిన స్థానిక ప్రజాప్రతినిధి.. రెండు రోజులుగా టిప్పర్లను రంగంలోకి దించి మట్టిని తరలిస్తున్నాడు. దీనిపై స్థానికులు ఫొటోలు తీసి మరీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటువైపు చూడలేదు.



● స్నాతకోత్సవం

పశ్చిమగోదావరి జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన (హార్టికల్చర్) విశ్వవిద్యాలయం ఆరో స్నాతకోత్సవం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో గురువారం ఘనంగా జరిగింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొని డిగ్రీలు పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందించారు.

6



జీవన జ్యోతి

6

- ఎనిమిది మందికి ప్రాణం పోశాడు
- బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవదానం

పాఠశాలలపై ప్రత్యేక దృష్టి

- మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0లో మంత్రి కొల్లు రవీంద్ర
- కాలేఖాన్‌పేట మునిసిపల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఉన్నతికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, ఒత్తిడి లేని విద్యావ్యవస్థను ఏర్పాటు చేశామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మెగా పేరెంట్ మీటింగ్ 2.0లో భాగంగా గురువారం మచిలీపట్నం కాలేఖాన్‌పేట గోపు వెంకట నానారావు మునిసిపల్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీల ద్వారా విద్యార్థులకు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలను నిర్వీర్యం చేసి విద్యావ్యవస్థను పాడు చేసిందని, ఎయిడెడ్ పాఠశాలల స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నం చేసిందన్నారు. చంద్రబాబు హయాంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశామని, దీనివల్ల విదేశాల్లో తెలుగు యువకులు ప్రముఖ స్థానాన్ని సంపాదించారన్నారు. డీఈవో పి.విజయరామారావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చామని, చదువుతో పాటు ఆటలు, పాటలు, యోగా నేర్పుతూ వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. హెచ్ఎం నారాయణరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో స్థలదాత గోపు వెంకట నానారావు కుమారులను మంత్రి సత్కరించారు. ఎంఈవో దుర్గాప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మరో మాయం

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఇంకో దోపిడీ

- నిన్న టెస్టింగ్ టూల్స్, నేడు ఏసీలు, కంప్యూటర్లు మాయం
- 3 స్ప్లిట్ ఏసీలు, ఒక విండో ఏసీ, 18 కంప్యూటర్లు అదృశ్యం
- ఇంటిదొంగల చేతివాటం.. ఆలస్యంగా వెలుగులోకి..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో ఇంటిదొంగల దోపిడీ ఎక్కువైంది. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ (సర్కిల్) కార్యాలయంలోని క్వాలిటీ కంట్రోల్ విభాగంలో రూ.కోటి విలువైన టూల్స్ మాయమైన ఘటన మరువకముందే, తాజాగా ఏసీలు, కంప్యూటర్లు అదృశ్యమైన విషయం వెలుగులోకి వచ్చింది. వీటి విలువ దాదాపు రూ.10 లక్షలు ఉంటుందని అంచనా. అధికారుల ఉదాసీనత, ఈఎన్‌సీ ఉన్నతాధికారుల అలసత్వం వెరసి ఇంటిదొంగలు చెలరేగిపోతున్నారు. స్టోర్‌రూమ్‌లో ఉన్న టూల్‌కిట్లు మాయమయ్యాయంటే.. సెక్యూరిటీ లేకపోవడం వల్ల కావచ్చు. ఏకంగా కార్యాలయంలోని ఏసీలు, కంప్యూటర్లు కూడా పోయాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఉద్యోగులు పనిచేసే గదుల్లోని 3 స్ప్లిట్ ఏసీలు, ఒక విండో ఏసీ, 18 పాత కంప్యూటర్లు కనిపించకుండా పోయాయి. సెలవు రోజుల్లో కార్యాలయానికి వచ్చి దోపిడీకి పాల్పడ్డారని తెలుస్తోంది. గత శీతాకాలం లేదా వర్షాకాలంలో ఇవి మాయమై ఉంటాయని కార్యాలయంలోని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అసలే వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఎస్ఈ కార్యాలయంలో ఏసీలు, కంప్యూటర్లు కూడా మాయం కావడంతో విషయాన్ని గుట్టుగా ఉంచారు.

అందరం ఒక్కమాట మీదే ఉందాం : ఉద్యోగుల సమాలోచనలు

క్వాలిటీ కంట్రోల్ విభాగంలో టూల్‌కిట్ల మాయం వ్యవహారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించడంతో ఇతర విషయాలు బయటకు పొక్కకుండా ఉద్యోగులంతా సంఘటితమయ్యారు. ఉన్నతాధికారులు ప్రశ్నిస్తే.. అంతా ఒకే అభిప్రాయంతో ఉండాలని, అనుమానాలకు తావీయొద్దని నిర్ణయించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ముగిసిన శాకంబరీ ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. యాగశాలలో గురువారం వేద పండితులు, అర్చకులు తుది హోమాలను నిర్వహించి అమ్మవారికి వివిధ ఉపచారాలను నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో దంపతులు ప్రధాన హోమగుండంలో సామగ్రిని హోమంలో సమర్పించారు. మూడు రోజుల పాటు శాకంబరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారి ఆలయాన్ని యాపిల్‌పండ్లు, బత్తాయి, అనాసలు తదితర పండ్లతో అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు కదంబ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. మూడురోజుల పాటు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. పౌర్ణమి కలిసి రావటంతో ఆలయంలో చండీహోమాలు, లక్షకుంకుమార్చనలు, శ్రీచక్రనవావరణార్చనలు, ఇతర ఆర్జిత సేవలు జరిగాయి. పూర్ణాహుతి అనంతరం ఈవో మాట్లాడుతూ, ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ముగిశాయని, భక్తులకు సంతృప్తికరంగా అమ్మవారి దర్శనాలు జరిగాయని చెప్పారు.

అన్నదానానికి ఈవో విరాళం

ఈవో వీకే శీనానాయక్ తన జన్మదినం సందర్భంగా గురువారం అన్నవితరణ నిమిత్తం రూ.50వేలను చెక్కురూపంలో విరాళంగా అందజేశారు. శీనానాయక్ దంపతులు, కుమారుడు సంతోష్‌కు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక ఆశీర్వచనం అందజేశారు.



భక్తి ప్రపత్తులతో గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని గిరిప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు ఉత్సవమూర్తులతో గిరిప్రదక్షిణ చేయటానికి సిద్ధంగా ఉన్న సమయంలో వర్షం అంతరాయాన్ని కలిగించింది. ఈవో శీనానాయక్, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి, తదితరులు కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. అనంతరం జై భవానీ, జైజై భవానీ అంటూ భక్తులు జేజేలు పలుకగా.. గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. వందలాదిమంది మహిళా భక్తులు అమ్మవారి నామస్మరణ చేసుకుంటూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ల మీదుగా బయలుదేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. వందలాది భక్తులు గిరిప్రదక్షణలో పాల్గొన్నారు. కాగా, గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు మార్గ మధ్యలో మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్న సూచన చేశారు.



కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి పై సాంస్కృతిక శోభ

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శాకంభరీ ఉత్సవాలను పురస్కరించుకుని ధర్మ ప్రచారం, సాంస్కృతిక కార్యక్రమాలతో గురువారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. అమ్మలగన్నయమ్మ ప్రకృతి స్వరూపంగా దర్శనమిస్తుండగా భజన సంకీర్తనలు, కోలాట నృత్యాలు, కూచిపూడి కళారూపాలు భక్తులను పరవశింపజేశాయి. రాజమండ్రికి చెందిన కోలాట నృత్య బృందాలు, చల్లపల్లికి చెందిన భజన సంకీర్తనలు, విజయవాడ నగరానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారులు దుర్గమ్మ సన్నిధిలో కళా ప్రదర్శన చేశారు. మన సంస్కృతి, కళాలను గురించి భావి తరాలకు ప్రకటించే కళాబృందాలకు అమ్మవారి దర్శనం కల్పించి, కదంబం ప్రసాదం అందచేశారు.



గురుపౌర్ణమి సందర్భంగా గురువులను సత్కరిస్తున్న ఈవో దంపతులు

గురువులకు పూజలు

గురుపౌర్ణమి సందర్భంగా గురువారం దేవస్థానం యాగశాలలో దేవస్థాన వేదపండితుడు తంగిరాల వెంకటేశ్వర ఘనాపాటి, సీనియర్ అర్చకులు శంకరమంచి శివప్రసాద్, ఆహితాగ్ని, వేదపండితుడు శ్రీరామచంద్ర సోమయాజుల దంపతులకు ఈవో శీనానాయక్ దంపతులు గురుపూజ చేశారు. శాస్త్రోక్తంగా, మంత్రపూర్వకంగా పాదపూజ చేసి పూలమాలలు సమర్పించారు. అనంతరం నూతన వస్త్రాలు, దక్షిణ తాంబూలాలు, ప్రసాదాలతో సత్కరించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, వేద పండితులు గురువుల ఆశీస్సులు అందుకున్నారు.

పశువుల మందుల టెండర్ రద్దు చేయాలి: జమలయ్య



అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పశువుల మందుల కొనుగోలుకు పాత నిబంధనలతోనే కొత్త టెండరును పిలవాలని ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పశుసంవర్ధక శాఖను కోరారు. నాసిరకం మందులు సరఫరా చేసే కంపెనీలకు అనుకూలంగా కొత్త నిబంధనలు పెట్టి, టెక్నికల్ బిడ్ ఓపెన్‌కు సిద్ధమౌతున్న నేపథ్యంలో ఆ టెండరును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ.15కోట్ల టర్నోవర్ కలిగిన కంపెనీలను టెండరు ద్వారా పిలవాల్సి ఉండగా.. టర్నోవర్‌ను రూ.12.5కోట్లకు కుదించడం వల్ల మందుల నాణ్యత ప్రశ్నార్థకమౌతుందన్నారు. 2018 నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్థాయిలో మందులు కొనే పద్ధతి ఉండగా, ఇప్పుడు జిల్లా పశువైద్యాధికారి మందులు కొనుగోలు చేసే పద్ధతిని ప్రవేశపెట్టడం సరికాదన్నారు. ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ విధానాన్ని కొనసాగించాలని, మందుల నాణ్యత నిర్ధారణ తర్వాతే కంపెనీలకు చెల్లింపులు జరపాలని సూచించారు.

వ్యవసాయం.. జీవన విధానం

» పట్టభద్రులకు అవార్డుల ప్రదానం

» డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



అకడమిక్ కౌన్సిల్ సభ్యులతో గవర్నర్, ఉద్యాన విశ్వవిద్యాలయం కులపతి ఎస్.అబ్దుల్ నజీర్

ఉంగుటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం కేవలం జీవనోపాధి సాధనం కాదని, అది జీవన విధానమని రాష్ట్ర గవర్నర్, ఉద్యాన విశ్వవిద్యాలయం కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో గురువారం పశ్చిమగోదావరి జిల్లా, వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన(హార్టికల్చర్)విశ్వవిద్యాలయం ఆరో స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించి డిగ్రీలు పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఐసీఏఆర్ -ఎన్ఏఏఆర్ఎం) డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్ విచ్చేసి స్నాతకోపన్యాసం చేశారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, హార్టికల్చర్ యూనివర్సిటీ స్థాపించిన ఒకటిన్నర దశాబ్ద కాలంలోనే ఉద్యానవన విద్య, పరిశోధన, విస్తరణలో ప్రభావవంతమైన కృషిద్వారా తనకంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని ఏర్పరచుకుని నేషనల్ అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ అక్రిడిటేషన్ బోర్డ్(ఎన్ఏఈఏబి)ఐసీఏఆర్, న్యూఢిల్లీ ద్వారా -ఏ- గ్రేడ్ గుర్తింపు సాధించడం అభినందనీయమన్నారు. విశ్వవిద్యాలయ అధ్యాపకుల అవిశ్రాంత ప్రయత్నాలు సాంకేతిక నైపుణ్యాన్ని అందించడమే కాకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దటంలో వారందిస్తున్న సహకారం అమూల్యమైనదని ప్రశంసించారు. ఈసందర్భంగా పట్టభద్రులవుతున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. తొలుత ఉపకులపతి కె.గోపాల్ విశ్వవిద్యాలయం ఏర్పాటు, అందిస్తున్న కోర్సులు, సాధించిన విజయాలు, పురోభివృద్ధి గురించి వివరించారు. అనంతరం అతిథుల చేతులమీదుగా బంగారు పతకాలు సాధించిన 10మంది విద్యార్థులతోపాటు 38మంది పీహెచ్‌డీ స్కాలర్లు, 119మంది పీజీ, 1152మంది బీఎస్సీ(ఆనర్స్)పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. 2023నుంచి 2025వరకు అత్యుత్తమ సేవలు అందించిన కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.దీప్తికి బెస్ట్ ఎక్స్‌టెన్షన్ సైంటిస్ట్ అవార్డు, డాక్టర్ కె.లలితకు బెస్ట్ టీచర్ అవార్డు, వి.శివకుమార్‌లకు బెస్ట్ సైంటిస్ట్ అవార్డులు, అందజేశారు. ఎన్ఏఏఆర్ఎం డైరెక్టర్ గోపాల్‌లాల్ మాట్లాడుతూ, ప్రపంచ ఆహారం, పోషక భద్రతకు ఉద్యాన రంగం చాలా అవసరమన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపుచేసి పోషక శ్రేయస్సును నిర్ధారించడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక స్థూల విలువ ఆధారిత మైన 11 ఉద్యానపంటలను క్లస్టర్డ్ విధానంలో ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్, ఉద్యాన విశ్వవిద్యాలయ కులపతి అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ కె.గోపాల్ ఘనస్వాగతం పలికారు. స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రజామందిరం వెలుపల పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం గవర్నర్ ప్రజామందిరంలోకి ప్రవేశించి అకడమిక్ కౌన్సిల్ సభ్యులతో గ్రూప్ ఫోటో దిగారు. తదుపరి ఆయనను ప్రత్యేక పోలీస్ బ్యాండ్ మేళంతో వేదిక వద్దకు సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ అగ్రికల్చర్ కో-ఆపరేషన్ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.శ్రీనివాసులు, బోర్డు మెంబర్లు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు, ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

» కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

» విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు

» ప్రభావవంతంగా ఫ్రై డే - డ్రై డే

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకొంటున్నామని, ఇప్పటికే వివిధ శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని, 9154970454 నెంబరుతో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం, యాంటీ లార్వా ఆపరేషన్స్, ఫాగింగ్, ఓవర్‌హెడ్ ట్యాంకుల క్లీనింగ్ అండ్ క్లోరినేషన్, ఆసుపత్రుల్లో వైద్య సేవలు, ఇంటింటి ఫీవర్ సర్వే తదితరాలపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని, ముందు జాగ్రత్త చర్యలకు మార్గనిర్దేశం చేసినట్టు వివరించారు. సీజనల్ వ్యాధులు, విషజ్వరాల నివారణ, నియంత్రణపై వివిధ శాఖల అధికారుల మధ్య పటిష్ట సమన్వయం, సమాచార మార్పిడి, తక్షణ స్పందనకు వీలుగా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు చేరిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి ప్రత్యేక బృందాలకు అందించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. ప్రజలతో పాటు అధికారులు, సిబ్బంది ఎవరైనా సీజనల్ వ్యాధులకు సంబంధించిన సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయవచ్చని, సరైన సమాచారాన్ని అందించి వ్యాధుల కట్టడిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 11వ తేదీ శుక్రవారం ఫ్రై డే - డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్ని నియోజకవర్గాల ప్రత్యేక అధికారులకు సూచించినట్టు కలెక్టర్ తెలిపారు.



శొంఠి జ్యోతిర్‌భాను(ఫైల్)

జీవన జ్యోతి

» అవయవదానంతో ఎనిమిదిమందికి ప్రాణం

విజయవాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడకు చెందిన దుర్గా ఎలక్ట్రానిక్స్ అధినేత శొంఠి జ్యోతిర్‌భాను అవయవాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేసి ఎనిమిది మంది ప్రాణాలు నిలిపారు. ఈనెల ఏడో తేదీన విజయవాడలోని రేడియోస్టేషన్ ఎదురుగా ఎంజీ రోడ్డుపై కుమారుడితో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్న జ్యోతిర్‌భాను రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. స్కూటీపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు వెనుక నుంచి ఢీ కొట్టడంతో జ్యోతిర్‌భాను తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ని రమేష్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించినా ఫలితం లేకుండా పోయింది. మరుసటి రోజు ఆయన బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. జ్యోతిర్‌భాను కుటుంబం అవయవదానంపై పూర్తి అవగాహన కలిగింది. ఆయన తల్లిదండ్రులు సైతం నేత్రాలను దానం చేశారు. ఈ నేపథ్యంలోనే జ్యోతిర్‌భాను కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. అవయవాల రవాణాలకు ప్రతికూల పరిస్థితులు నెలకొనడంతో రెండు రోజుల పాటు ఆసుపత్రిలోనే జ్యోతిర్‌భానును ఉంచారు. గురువారం అవయవాలను వైద్యులు సేకరించారు. కిడ్నీని విజయవాడ క్యాపిటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి అమర్చారు. గుండెను తిరుపతిలోని పద్మావతి ఆసుపత్రికి, లివర్‌ను గుంటూరులోని మణిపాల్ ఆసుపత్రికి, ఊపిరితిత్తులను హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రికి, నేత్రాలను విజయవాడలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందజేసినట్టు వైద్యులు వెల్లడించారు. జ్యోతిర్‌భాను భౌతికంగా దూరమైనా, ఎనిమిది మందిలో సజీవంగా ఉన్నాడనే సంతోషాన్ని ఆయన కుమారులు, కుటుంబ సభ్యులు వ్యక్తం చేశారు.



తంగిరాల సౌమ్యను సత్కరిస్తున్న తానా సభ్యులు

సౌమ్యకు తానా సభ్యుల సత్కారం

నందిగామ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఐటీరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి తెలుగు వారు విదేశాలలో స్థిరపడేలా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర శ్రామికుడిలా నేటికీ పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. తానా సభలకు అమెరికా వెళ్లిన ఆమె పలు రాష్ట్రాల్లో పర్యటించి తెలుగు వారితో మాట్లాడారు. ఉత్తర అమెరికాలో పర్యటనలో ఆమెను పలువురు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ, ఐటీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన చంద్రబాబు లక్షలాది మంది తెలుగువారిని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా తీర్చిదిద్దారన్నారు. అదే స్ఫూర్తితో నేడు ఎంతోమంది విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ప్రవాసాంధ్రులు స్పందించిన తీరు మరువలేనిదన్నారు. సీఎం చేపట్టిన పీ4 పథకం అమలులో ప్రవాసాంధ్రులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా తానా సేవలను ఆమె కొనియాడారు.



బుద్ధా వెంకన్నకు శాలువా కప్పి సత్కరిస్తున్న కె.శివశర్మ

బుద్ధా వెంకన్నకు సత్కారం

వన్‌టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను వన్‌టౌన్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం 39వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కె.శివశర్మ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వెంకన్నకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివశర్మ మాట్లాడుతూ, తనకు రాజకీయ ఓనమాలు నేర్పిన గురువు బుద్దా వెంకన్న అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏలూరి వెంకన్న, నక్కా కృష్ణ, నెల్లూరు నాని, రామిశెట్టి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ ఈయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బస్‌స్టేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 129 డిపోలు, నాలుగు వర్క్‌షాపుల వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్యలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయం వద్ద పతాక ఆవిష్కరణ జరిపిన అనంతరం విజయవాడ మెయిన్ డిపో వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, మరికొందరు ప్రముఖులు హాజరవుతారని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

అమరావతి రాజధానిలో పూలింగ్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్

» తిరువూరు సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావు సస్పెన్షన్

విజయవాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలోని వడ్డమానులో పూలింగ్‌లో ఉన్న వ్యవసాయ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేసినందుకు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావును విజయవాడ డీఐజీ రవీంద్రనాథ్ సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో విజయవాడ గాంధీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ డి.శ్రీనివాసరావును ఇన్‌చార్జిగా నియమించారు. మూడు రోజుల కిందటే ఈ ఘటన జరిగినా.. రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారులు అత్యంత రహస్యంగా ఉంచారు. ప్రాథమిక సమాచారం మేరకు.. గుంటూరు జిల్లా మేయర్ కోవెలమూడి నానికి చెందిన తుళ్లూరులోని 4 ఎకరాల వ్యవసాయ భూమిని శివశంకరరెడ్డి అనే వ్యక్తి మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించినట్టుగా తెలిసింది. సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావు ఆ ప్రైవేటు వ్యక్తికి సహకరించారని తన దృష్టికి రావటంతో గుంటూరు మేయర్ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి, రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఐజీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విజయవాడ డీఐజీ విచారణ జరిపారు. ప్రాథమిక విచారణలో అక్రమ రిజిస్ట్రేషన్‌గా తేలటంతో బాణావతు జగన్మోహనరావును సస్పెండ్ చేయటం జరిగింది. బాణావతు జగన్మోహనరావు ఇంతకు ముందు మైలవరం సబ్ రిజిస్ట్రార్‌గా పని చేశారు. కొద్దికాలం కిందట ఆయన తిరువూరుకు సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చారు. శివశంకరరెడ్డి అనే వ్యక్తి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ), డెత్ సర్టిఫికెట్లను చూపి ఆ భూమి తమదేనని పార్టీషన్ చేయించుకున్నట్టు తెలుస్తోంది.

సబ్ రిజిస్ట్రార్ 1బీ రికార్డును పరిశీలిస్తే.. అసలు ఈ భూమిపై వారికి వాస్తవ హక్కులు ఉన్నాయా లేదా అన్నది తెలిసేది. కానీ, ఈ కేసులో బాణావతు జగన్మోహనరావు 1బీని పరిశీలించలేదు. పార్టీషన్ డీడ్స్‌కు సంబంధించి పూర్వార్జితాలకు 1బీ పరిశీలన అవసరం లేదన్న నిబంధన ఉంది. ఈ నిబంధనను ఆధారంగా చేసుకుని సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసినట్టుగా తెలుస్తోంది. ఈ రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే గుంటూరు మేయర్ కోవెలమూడి నాని బంధువులు తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి ఇవి తమ భూములని, అక్రమ రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని పెద్ద గొడవే చేశారు. దీంతో ఆ రోజున తనను బలవంతం పెట్టి శివశంకరరెడ్డి అనే వ్యక్తి పార్టీషన్ డీడ్ రాయించుకున్నారని తిరువూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసు పెట్టినప్పటి నుంచి సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావు సెలవులో ఉన్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తిరువూరు సబ్ రిజిస్ట్రార్ బాణావతు జగన్మోహనరావును సస్పెండ్ చేశారు. శివశంకరరెడ్డి ఎవరు , ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి అన్న వాటిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.

ఆగస్టు 21 నుంచి చెస్ టోర్నమెంట్

లబ్బీపేట(స్పోర్ట్స్), జూలై 10 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టు 21 నుంచి 25 వరకు ఆంధ్ర చెస్ అసోసియేషన్, ఎస్.ఆర్.ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.ఫణికుమార్ తెలిపారు. టోర్నమెంట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం కలక్టర్ లక్ష్మీశ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫణి మాట్లాడుతూ, పీబీ సిద్ధార్థ కళాశాలలో 10 లక్షలనగదు బహుమతితో ఈ టోర్నమెంట్ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకడమి వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ కృష్ణారావు, ఆంధ్ర, ఎన్టీఆర్ అసోసియేషన్ సెక్రటరీలు కె.జగదీష్, ఎం.రాజు, చెస్ కోచ్ ఎస్.కె. కాశిమ్ తదితరులు పాల్గొన్నారు.



సుజికాన్ 2025 బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్లు ధీరజ్, సతీష్ కుమార్ తదితరులు

నేటి నుంచి సుజికాన్-2025 సదస్సు

లబ్బీపేట, జూలై10 (ఆంధ్రజ్యోతి): 36వ సదరన్ యూరాలజిస్ట్స్ అసోసియేషన్ వార్షిక సదస్సు (సుజికాన్ 2025)ను ఈ నెల 11 నుండి 13వరకు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్టు కార్యక్రమ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ధీరజ్ కాసరనేని తెలిపారు. లబ్బీపేటలోని ప్రశాంత్ హాస్పటల్స్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చరిత్రలోనే అతి పెద్ద యూరాలజీ సమావేశం జరగనుందని, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 1000 మంది యూరాలజిస్టులు హాజరవుతున్నారని తెలిపారు. తాజా ఆవిష్కరణలను ప్రదర్శిస్తూ 75 ట్రేడ్ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన యూరాలజికల్ సబ్ స్పెషాలటీలలో 50కి పైగా శాస్త్రీయ సెషన్‌లు నిర్వహించబడతాయని తెలిపారు. అదే విధంగా 8 కేంద్రీకృత ఉప స్పెషాలటీ సమావేశాలు, సాంస్కృతిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సుజికాన్ 2025 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డాక్టర్ కె.ప్రశాంత్ కుమార్, డాక్టర్ సీవీ సతీష్ కుమార్, డాక్టర్ జి.శ్రీనివాసరావు, డాక్టర్ జి.రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపూర్-అరుణాచలం స్పెషల్ రైలుకు వీరవాసరంలో అదనపు హాల్ట్

రైల్వేస్టేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నరసాపూర్ - తిరువణ్ణామలై 07219 స్పెషల్ రైల్ ఈనెల 16న వీరవాసరంలో అదనంగా నిలుపుదల చేస్తున్నట్లు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల అధికారిణి నుస్రత్ ఎం మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా తిరువణ్ణామలై - నరసాపూర్ 07220 రైల్ ఈనెల 17వ తేదీన వీరవాసరంలో అదనంగా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన పాలకొల్లు, భీమవరం స్టేషన్‌లలో రైళ్లు యధావిగా ఆగుతాయని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బుసలు కొడుతున్న బుసక వ్యాపారం

(5వ పేజీ తరువాయి)

నాయకులు రుసరుసలాడుతున్నారు. పార్టీ కోసం అందరూ పనిచేశారని, కొందరు మాత్రం ఇదే అదనుగా భావించి బుసకను అక్రమంగా తవ్వేస్తూ సొమ్ము చేసుకోవడం ఎంతవరకు సమంజసమనే వాదనను వినిపిస్తున్నారు. సముద్ర తీర గ్రామాలకు ముప్పుతెచ్చేలా ఈ తవ్వకాలు జరుగుతున్నాయని, పార్టీకి చెడ్డపేరు వస్తుందని, భవిష్యత్తులో ప్రజలు ఈ విషయంపై ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పాలని వారు చర్చించుకుంటున్నారు.

ఎవరా చోటా నాయకుడు

సముద్ర తీరంలోని ప్రభుత్వ భూముల నుంచి బుసకను అక్రమంగా తరలిస్తున్న అంశంపై ఈ చోటా నాయకుడిపై సీఎంవోకు అనేక ఫిర్యాదులు అందాయి. అయినప్పటికీ మంగినపూడి పరిసర గ్రామాలను తమ చెప్పుచేతల్లో పెట్టుకున్న కొందరు పెద్దలు బుసక రవాణాకు అండగా నిలుస్తున్నారు. ఈ చోటా నాయకుడు స్థానిక ప్రజాప్రతినిధికి, ప్రతిపక్ష నాయకుడికి కూడా అనుకూలంగా ఉంటున్నాడనే విమర్శలు వస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష నాయకులతో అంటకాగుతున్న ఈ చోటా నాయకుడు మైనింగ్ విభాగం అధికారులను తన గుప్పెట్లో పెట్టుకుని బుసక అక్రమ రవాణావైపు రాకుండా తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధి మాటకన్నా, ఈ చోటా నాయకుడు చెప్పినట్టుగానే మైనింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. బుసక అక్రమ తవ్వకాలు, విక్రయాలను తమ చెప్పుచేతల్లో పెట్టుకున్న కొందరు తాము చెప్పినట్టుగానే మండలంలోని రాజకీయం, ఇతరత్రా వ్యవహారాలు నడుస్తాయని తప్పుడు సంకేతాలు ఇస్తుండటంతో ఈ వ్యవహారం రాజకీయంగానూ దుమారం రేపుతోంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

సమష్టి కృషితోనే ఆర్టీసీకి లాభాలు



సిబ్బందికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీపీటీవో కె.వెంకటేశ్వర్లు

గన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషితోనే ఆర్టీసీ లాభాల బాటలో నిలుస్తుందని డీపీటీవో కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్టీసీ డిపోను గురువారం సందర్శించారు. పరిశుభ్రత, ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలు, సిబ్బంది రెస్ట్ రూం, తాగునీరు, టాయిలెట్లు పరిశీలించారు. గ్యారేజ్‌లోని అన్ని సెక్షన్లు తనిఖీ చేసి సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. బస్సుల కండిషన్ ను పరిశీలించారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలుకు సమాయత్తం అయిందని బస్సుల కండిషన్ మెరుగు పరచాలని ఆదేశించారు.



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్‌రావు



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



పోరంకి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎస్సై సురేష్

క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

గన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల మెగా పేరెంట్స్ మీటింగ్‌లో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సందేశమిచ్చారు. తల్లిదండ్రులు పిల్లల ఆశయాలకు అనుగుణంగా విద్యను నేర్పించాలని సూచించారు. డీసీవో మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మీ పాల్గొన్నారు. పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హెచ్ఎం ఝాన్సీరాణి, జాస్తి విజయభాషణ కుమార్, రిటైర్డ్ అధ్యాపకులు గన్నే వెంకట్రావు, మద్దుకూరి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. **ఉంగుటూరు :** మండలంలోని 64 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆత్కూరు జడ్పీహైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ పిల్లల నడవడికలను గమనిస్తూ క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దటంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. విద్యార్థులు తల్లులపాదాలను పూజించి ఆశీర్వచనాలు అందుకున్నారు. సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ, ఎంఈవో జె.సాంబశివరావు, ఎంపీపీ వి.సరోజిని, హెచ్ఎం పి.రాధికారాణి, డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. ఉంగుటూరు, మానికొండ, పెదఅవుటపల్లి, తేలప్రోలు, వెల్దిపాడు, తరిగొప్పల, పొట్టిపాడు జడ్పీహైస్కూళ్లలో సమావేశాలు సందడిగా జరిగాయి. విద్యార్థినీ, విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో, హెచ్ఎంలు, టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిథులు, విద్యాకమిటీ చైర్మన్లు పాల్గొన్నారు. **పెనమలూరు :** ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పోరంకి ఉన్నత పాఠశాల, గంగూరు నోబుల్ పాఠశాలల్లో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న అనుమోలు ప్రభాకరరావు, పూర్వ విద్యార్థి అశోక్‌లను అభినందించారు. పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనని పెనమలూరు సీఐ జె.వెంకటరమణ అన్నారు. ప్రిన్సిపాళ్లు అంజిబాబు, పీఎస్ఆర్, జితేంద్ర, డీజీఎం జాగర్లమూడి రవిశంకర్, ఏజీఎం రాజశేఖర్ బాబు, డీన్ శ్రీరాంచంద్ చౌదరి, ఏవోలు పాల్గొన్నారు. తాడిగడప ఉన్నతపాఠశాల, కానూరు, పోరంకి, పెనమలూరు, పెదపులిపాక, చోడవరం, గంగూరు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నేతలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని పలు విషయాలు చర్చించారు. యనమలకుదురు ఉన్నత పాఠశాలలో మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాం ప్రసాద్, యండవల్లి సురేష్, సజ్జ ఏడుకొండలు, సింగం సుబ్రహ్మణ్యం, తాడిశెట్టి వీరాస్వామి, బలగం నాగరాజు పాల్గొన్నారు. పెనమలూరు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి హేమంత్‌కుమార్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కిలారు శివకుమార్ చేతుల మీదుగా మూడు వందల భోజనం ప్లేట్లను అందజేశారు. **కంకిపాడు :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. హెచ్ఎం డి. ఉమాదేవి, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, వైస్ ఎంపీపీ దూళిపూడి కిషోర్, పేరంట్స్ కమిటీ చైర్మన్ అజ్గర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. **విజయవాడ రూరల్ :** నున్నలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ జరిగింది. తల్లులకు పిల్లలు పాదపూజ చేసి ఆశీర్వాదం అందుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.సైబర్ నేరాలు, మొక్కల పెంపకంపై నాటికలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఇన్‌చార్జి హెచ్ఎం రవిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. **కానూరు :** కానూరు కృష్ణానగర్‌లోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, కూటమినేతలు పాల్గొని ప్రభుత్వం విద్యాపరంగా చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మీతోపాటు విశ్రాంత ఉపాధ్యాయుడు బ్రహ్మం, ప్రతినిధి శివరామకృష్ణ ప్రసాద్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ఇచ్చారు. పెదపులిపాక జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గుంటూర శ్రీనివాస చౌదరి, దాతలు వల్లూరి రాజమోహనరావు, వల్లూరి శ్రీమన్నారాయణ, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు గోపాలకృష్ణ, సంపూర్ణమ్మ, ఈవో ఓగిరాల తిరుమల వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమని ఎన్ఎస్ ఎల్సీ వైస్‌చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ బాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, వేములపల్లి శ్రీనివాసరావు, సుంకర సుబాస్‌చంద్ర బోస్ పేర్కొన్నారు. వేలేరు, కానుమోలు, రేమల్లె, ఆరుగొలను, రంగన్నగూడెం, (అమ్మ నిలయం, వేలేరు, వీరవల్లి హైస్కూళ్లలోని హెచ్ఎంల ఆధ్వర్యంలో గురువారం మెగా పేరెంట్స్ డే నిర్వహించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కోడూరుపాడు ఎంపీపీ స్కూల్‌లో మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు, పాండురంగారావు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్ :** బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ డేలో ఎస్సై వి.సురేష్ మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి వీరమాచనేని సత్యప్రసాద్, జనసేన నేత చలమలశెట్టి రమేశ్‌బాబు, వ్యవసాయ శాఖ ఏవో రంగనాథబాబు, కడగల శ్రీనివాసరావు, అంగలూరు డైట్ కళాశాల పరిశీలకుడు జోజిబాబు, ఎస్సై పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు అందజేశారు. **ఉయ్యూరు :** ఉయ్యూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పేరెంట్, టీచర్ల సమావేశాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు పిన్నమనేని చంద్రమోహన్, ద్విజేంద్రబాబు, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, ఎస్ఎంసీ చైర్మన్ శివ సాయి ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్పంచ్ గోలివసంతకుమార్ పాల్గొన్నారు. విద్యార్థులకు కళాశాల పూర్వ విద్యార్థి కె.బాలగంగాధరతిలక్ బహుమతి అందజేశారు. కడవకొల్లు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో సుధారాణి ఎన్ఎంఎంఎస్ విజేత కట్టా అలేఖ్యకు మెరిట్ కార్డు బహూకరించారు.



వేలేరు హైస్కూల్‌లో తల్లుల ఆశీర్వాదం తీసుకుంటున్న బాలికలు



ఉయ్యూరు జడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

విలువలతో కూడిన విద్య అందించాలి

గన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యను అందించిన వారే ఉత్తమ గురువులు అవుతారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. చిన అవుటపల్లి పుణ్య చారిటీస్ వృద్ధాశ్రమ అధినేత జాస్తి విజయ భూషణ్ కుమార్ ఆధ్వర్యంలో గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయుల అభినందన సభ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యార్లగడ్డ పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్ఎం డి.ఝాన్సీ రాణి, పుణ్యచారిటీస్ అధినేత జాస్తి విజయా భూషణ్ కుమార్, గన్నె వెంకట్రావు, నర్రా సీతారామారావు, గూడపాటి తులసీమోహన్, పడమట రంగారావు పాల్గొన్నారు.

కాటూరు పీఏసీఎస్ చైర్మన్‌గా చంద్రశేఖర్

ఉయ్యూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘం అధ్యక్షుడిగా గుర్రం చంద్రశేఖర్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నాయకులు వేమూరు శ్రీనివాసరావు, శనివారపు వెంకటనారాయణ తది తరులు పాల్గొన్నారు



శాకంబరిగా తిరుపతమ్మ

గన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పాతగన్నవరం లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానంలో అమ్మవారిని గురువారం శాకంబరిగా అలంకరించారు. శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఉత్సవమూర్తులను, ఉప దేవత అంకమ్మతల్లిని, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అందంగా అలంకరించారు. లలితా సహస్రనామ పారాయణం, లక్ష్మీ, అన్నపూర్ణ అష్టోత్తరాలు, హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన కదంబ ప్రసాదాన్ని కూరగాయలను భక్తులకు వితరణగా అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

కానూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా ఉండరాదని మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ అన్నారు. శానిటరీ మేస్త్రుల సమావేశంలో గురువారం జరిగింది. పారిశుధ్య విషయంలో అలసత్వం పనికిరాదన్నారు. కార్మికులు సక్రమంగా విధులకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రం సేవలు భేష్

గుణదల, జూలై 10(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది చేస్తున్న సేవలు ఆనందదాయకంగా ఉన్నాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబరు జి.శ్రీదేవి అన్నారు. ప్రసాదంపాడులో గల 1, 3, 8, 9 అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పిల్లలతో మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో పీడీ రుక్సానా బేగం, సీడీపీవో పి.భానుమతి, సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనుమోలు ట్రస్టు సాయం

పెనమలూరు, జూలై10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దాతలు ఇచ్చిన సహాయాన్ని అందిపుచ్చుకొని వృద్ధిలోకి రావాలని అనుమోలు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అనుమోలు ప్రభాకరరావు అన్నారు. పోరంకి ఉన్నత పాఠశాలలో గురువారం అనుమోలు ట్రస్టు తరఫున 11మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు వేల చొప్పున 55వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఎంపీడీవో బండి ప్రణవి, ఎంఈవోలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి, పూర్వ విద్యార్థి అశోక్, కిలారు శివకుమార్, హెచ్ఎం సుమలత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



బాపులపాడు షిరిడీ సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ కొల్లి వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి పురస్కరించుకొని ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, పూజలు వేడుకగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో పల్లకీ సేవ నిర్వహించారు. మూడు వేల మందికి అన్నసంతర్పణ చేశారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** ప్రతి ఒక్కరినీ సన్మార్గంలో నడిపిస్తూ భవిష్యత్తు తరాలను తీర్చిదిద్ది జీవితంలో వెలుగు నింపే పరబ్రహ్మ గురువేనని అర్చకులు గణేష్, శ్రీనివాసరావు తెలిపారు. పెరికీడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, వీరవల్లి షిరిడిసాయిబాబా ఆలయంలోగురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నండూరి శర్మ, నక్కా బాబు పాల్గొన్నారు. వీరవల్లి షిరిడిసాయిబాబా ఆలయంలో పండ్ల రసాలతో బాబాకు అభిషేక పూజలు నిర్వహించి, అష్టోత్తర శతనామావళి గానం చేశారు. వడ్లపూడి లక్ష్మీపెరుమాళ్లు అన్నదానానికి రూ.54వేల విరాళం అందజేశారు. రావి ఈశ్వర్, తవ్వా ఆదిలక్ష్మి, మాచినేని బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **కానూరు :** కానూరులో గురపౌర్ణమి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. కామయ్యతోపులోని శ్రీగీతా మందిరం ఆవరణలోని షిర్డిసాయి ఆలయం, కానూరు కేపీసీ కాలనీలోని షిర్డిసాయి ఆలయం, వందఅడుగుల రోడ్డులోని షిర్డిసాయి ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు సాయి దర్శనం చేసుకున్నారు. **పెనమలూరు :** గురుపౌర్ణమి సందర్భంగా తాడిగడప మునిసిపాలిటీలోని పోరంకి సీతాపురం కాలనీ, ఉయ్యూరు షిరిడీ సాయిబాబా ఆలయాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. **ఉయ్యూరు :** షిర్డీసాయి మందిరాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుక ఘనంగా నిర్వహించారు. గండిగుంట బైపాస్ షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు నిర్వహించారు. కడవకొల్లు సాయిబాబా మందిరంలో వడ్డే బసవరాజ్యం చారిట బుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుక నిర్వహించి అన్న సమారాధన చేశారు. ఉయ్యూరు శివాలయం రోడ్డులో సాయిబాబా మందిరం వద్ద పూజలు చేశారు. ఈసందర్భంగా అన్న సమారాధనను మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రారంభించారు. తోట్లవల్లూరురోడ్డులో బాబా మందిరంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ పూజలు చేసి చైర్మన్ వి. సత్యనారాయణ, మాజీ చైర్మన్ జె.పూర్ణచంద్రరావు, కూనపరెడ్డి వాసు అన్నసమారాధన ప్రారంభించారు. **కంకిపాడు:** ఉప్పులూరు షిర్డి సాయి మందిర కమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదములు పంపిణీ చేసారు పాలకవర్గం గ్రామస్తులు పాల్గొన్నారు. **పెనమలూరు:** పోరంకి శ్రీనివాసనగర్‌లో శ్రీ షిర్డి సాయి సేవాసమితి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పాలకవర్గం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదములు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొన్నారు.

ఆటోనగర్ మెకానిక్‌ల అభివృద్ధికి కృషి



ప్రసంగిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు

కానూరు, జూలై10 (ఆంధ్రజ్యోతి) : జవహర్ ఆటోనగర్‌లో మెకానిక్స్ అభివృద్ధికి శాయశక్తుల కృషిచేస్తానని అసోసియేషన్ నూతన అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు(కొండ) అన్నారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో గురువారం జవహర్ ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ హాలులో జరిగింది. ఈసందర్భంగా 2025-28 కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జవహర్ ఆటోనగర్‌ను ఎవరూ ఇక్కడ నుంచి తరలించలేరన్నారు.

ప్రమాణస్వీకారం...

అసోసియేషన్ సభ్యుడు శివాజీ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. రెండోసారి ఎన్నికైన గంధం వెంకటేశ్వరరావు(కొండ), కార్యదర్శిగా షేక్ దస్తగిరి, కోశాధికారిగా షైలు రామ్మోహనరావు, ఉపాధ్యక్షులుగా ఐనాల ఉమామహేశ్వరరావు, సయ్యద్ రియాజ్ గాలిబ్, రేఖపల్లి రామకృష్ణప్రసాద్, సహాయ కార్యదర్శులుగా తోట శంకరరావు, వేమూరి చంద్రమోహన్, లక్కింశెట్టి కనకారావు, కార్యవర్గ సభ్యులుగా వడ్లాని రాఘవరావు, షేక్ చాన్‌భాష, పంచల గంగాధరరావు, మరడ కుమారరంగ, నిమ్మగడ్డ ప్రసాదరావు, యడాలి శివశంకరరావు, బలిజేపల్లి శ్రీనివాసరావు, మరీదు శివశంకరావు, సుంకర విష్ణుభూపతి, రాయపురెడ్డి లక్ష్మణరావు, గుత్తా బ్రహ్మేంద్ర వరప్రసాద్, పంచకర్ల వెంకట రామ్మోహనరావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారిగా పంచకర్ల వెంకట రమణ వ్యవహరించారు.

పీఏసీఎస్ సేవలను రైతుకు చేరువ చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సేవలు అందించేందుకు పీఏసీఎస్ చైర్మన్లు కృషి చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. వీరవల్లి పీఏసీఎస్ చైర్మన్ కలపాల వి.ఎన్.ఎస్.ప్రసాద్(నాని) ఎమ్మెల్యేను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కానుమోలు పీఏసీఎస్ చైర్మన్‌గా దన్నే దుర్గారావు గురువారం పదవీస్వీకారం చేశారు. డైరెక్టర్లు అచ్చెన వెంకటేశ్వరరావు, చిట్టూరి ఏడుకొండలుతో కలిసి బాధ్యతలు స్వీకరించారు.

వేలేరులో సుపరిపాలనలో తొలి అడుగు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు అన్నారు. వేలేరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ అవిర్నేని భవానిశంకర్, అధ్యక్షుడు కాజ సురేష్, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.



అమ్మవార్లకు ఆషాఢ సారె

ఉంగుటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మానికొండలో అన్ని దేవాలయాలకు గ్రామస్థులు వెళ్లి అమ్మవార్లకు ఆషాఢ సారెను సమర్పించారు. వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త ఆరికట్ల రవికుమార్ ఆధ్వర్యంలో సారె సమర్పించారు. గ్రామపెద్దలు గోగినేని బాలకృష్ణ, వట్టికూటి కిషోర్‌బాబు, నర్ని వెంకటేశ్వరరావు, బడుగు కిషోర్‌కుమార్, సూరెడ్డి రామ్మోహనరావు, పులిబండ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** గంగానమ్మతల్లికి ఆషాఢ సారె సమర్పించారు. గన్నవరం ఖండ సేవా ప్రముఖ్ యడవల్లి పాండురంగారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ చేసి మేళతాళాల మధ్య జైదుర్గ నామస్మరణలతో ఊరేగింపుగా బయలుదేరి సమర్పించారు. తట్టి వెంకట సుబ్బారావు, శేఖర్, కొలుసు బలరాం పాల్గొన్నారు. పెరికీడులోని గంగాంబిక అమ్మకు ఆషాఢసారె సమర్పించారు.

మెరిట్ విద్యార్థినికి ఆర్థిక సాయం

ఉయ్యూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్ అన్నారు. గండిగుంట అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు బొప్పూడి ఉషారామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో బీటెక్ ఫైనలియర్ విద్యార్థినికి రూ. 10 వేలు ప్రోత్సాహక బహుమతి గురువారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కంచర్ల గంగాధరరావు, నాదెళ్ల యుగందర్ ప్రసాద్ తదితరులు ఉషా రామకృష్ణ దంపతులను అభినందించారు.

తాడిగడపలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, జూలై10 (ఆంధ్రజ్యోతి): తాడిగడప సబ్‌స్టేషను పరిధిలోని 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు గుణదల ఈఈ హరిబాబు తెలిపారు. తాడిగడప గ్రామం, హైస్కూలు, ఊరచెరువు, ఎస్‌టీబీఎల్ కాలనీ, పెదపులిపాకల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రణాళిక

విజయవాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గృహ, వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ వినియోగారులకు రానున్న రోజుల్లో మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏపీసీపీడీసీఎల్ అధికారుల ప్రణాళిక సిద్ధం చేశారు. ఇటీవల జరిగిన వార్షిక సమావేశంలో జిల్లావ్యాప్తంగా గతేడాది నిర్మాణం చేసిన సబ్ స్టేషన్ల వివరాలను, ఈ ఏడాది నిర్మించ తలపెట్టిన సబ్ స్టేషన్ల వివరాలను ప్రకటించారు. తాజా నివేదిక ప్రకారం 2024లో 132/33 కేవీ స్టేషన్లు రెండు నిర్మాణం చేయాలని తలపెట్టి వాటిని పూర్తి చేశారు. 33/11 కేవీ సబ్ స్టేషన్లలో నాలుగింటికి మూడు, 30 వ్యవసాయ ఫీడర్లకు 16, పీఎం సూర్యఘర్ పథకం ద్వారా 20వేల సోలార్ రూఫ్‌టాప్‌లకు 1,969, 3,085 వ్యవసాయ సర్వీసులకు గానూ 3,765 పూర్తి చేశారు. ఈ ఏడాది 33/11 కేవీ సబ్ స్టేషన్లు రెండు నిర్మాణం పూర్తి చేయాలని, వ్యవసాయ ఫీడర్లు 68 ఏర్పాటు చేయాలని, సోలార్ రూఫ్‌టాప్‌లు 58,031, వ్యవసాయ కనెక్షన్లు 2,889 మంజూరు చేయాలని అంచనా వేశారు. రీవ్యామ్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ (ఆర్‌డీఎస్) పథకంలో భాగంగా 11 కేవీ ఫీడర్లు 84, 33 కేవీ ఓవర్ లోడ్ ఫీడర్లు తొమ్మిది, 11 కేవీ ఓవర్ లోడ్ ఫీడర్లు 29 అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటితో పాటు 33 కేవీ ఫీడర్లు మూడు, 11 కేవీ ఫీడర్లు 12, 18 ఎల్‌టీ లైన్లు పాత వాటి స్థానంలో పునరుద్ధరించనున్నారు.

మాజీ సీఎం జగన్ వీకెండ్ పొలిటీషియన్..!

● ఏపీ కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్ హెడ్ భార్గవ్

విజయవాడ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ వారంతపు రాజకీయ నేతగా రూపాంతరం చెందారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్ హెడ్ వల్లూరి భార్గవ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. పర్యటన పేరుతో మామిడి పంటలను నాశనం చేశారని, నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మహిళా ఎమ్మెల్యేని సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా అవమానకర వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. రైతు శ్రేయస్సు పేరుతో తప్పుడు స్క్రిప్ట్‌ను ప్రదర్శించి విఫలమయ్యారన్నారు. బెంగళూరు నుంచి వారం చివరిలో రాష్ట్రానికి వచ్చి రాజకీయ దుమారం రేపుతున్న జగన్‌పై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే అధికారంలో కొనసాగే అర్హత కూటమి ప్రభుత్వం కోల్పోతుందని హెచ్చరించారు. జగన్ చేస్తున్న తప్పులపై చర్యలు తీసుకోకుండా ఉన్న హోంమంత్రి, అధికారులు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



నకిలీ విత్తనాలపై మంత్రి ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

నకిలీ విత్తనాలు అమ్ముతున్నారు..!

● మంత్రి ఎదుట రైతుల ఆందోళన

మచిలీపట్నం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎరువులు, పురుగు మందుల షాపుల్లో నకిలీ విత్తనాలు అమ్ముతున్నారని, అవి మొలవడం లేదని కాలేఖాన్‌పేటకు వచ్చిన మంత్రి కొల్లు రవీంద్ర సమక్షంలో కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు సెంటర్, తదితర షాపుల్లో 210, 1262 విత్తనాలు కొన్నామని, ఆ విత్తనాలు మొలవలేదని రైతులు పిప్పళ్ల సూర్యప్రకాశరావు, వెంకట శివరామకృష్ణ, అడ్డాల కృష్ణ, చండిక కేశవరావు, గణేష్, ఏ శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆ కంపెనీల యజమానులపై వారు మంత్రికి ఫిర్యాదు చేశారు. మంత్రి స్పందించి అధికారులను పిలిచి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే శారదానగర్‌లోని ఆరోగ్యకేంద్రంలో వైద్యుడిని నియమించాలని స్థానికులు మంత్రిని కోరారు.



పొలంలో నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

పామర్రులో ముమ్మరంగా వరి నాట్లు

పామర్రు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువలకు పుష్కలంగా నీరు అందటంతో పాటు వరుణ దేవుడు కరుణించటంతో పామర్రు మండలంలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పొలాలకు దమ్ము చేయటం, నాట్లు వేయటం వంటి పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ లక్ష్యం 9118 హెక్టార్లుగా వ్యవసాయాధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు 3580 హెక్టార్లలో వరి నాట్లు పూర్తయినట్టు వ్యవసాయాధికారి బీ శివనాగరాణి గురువారం తెలిపారు. ప్రస్తుతం మండల పరిధిలో పెదమద్దాలి, బల్లిపర్రు, అడ్డాడ, ఐనంపూడి, పోలవరం, ఎలకుర్రు, కొరిమెర్ల, కనుమూరు, కురుమద్దాలి, జమీగొల్వేపల్లి గ్రామాల్లో ఇప్పటికే 30 శాతం వరకు నాట్లు పూర్తి కాగా మిగిలిన గ్రామాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలస్యంగా పనులు ప్రారంభించిన రైతులు పొలాల్లో దమ్ము చేస్తున్నారు. మరో 15 రోజుల్లో వరినాట్లు పూర్తయివుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

వర్షంతో రైతులకు మరింత ఊరట

ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సాగుకు ఊతమిస్తున్నాయి. నిన్నమొన్నటి వరకు ప్రతికూల వాతావరణంతో రైతుల్లో అయోమయం నెలకొంది. మండలంలో కొంతమంది రైతులు బోర్లు ఆధారంగా వ్యవసాయం చేస్తున్నప్పటికీ భూగర్భ జలాలు అడుగంటడంతో కొన్ని ప్రాంతాల్లో బోర్లు సైతం సరిగా నీటిని తోడలేకపోతున్నాయి. దీంతో కొందరు రైతులు తమ పొలాలకు వర్షం నీరు కూడా తోడైతే బాగుంటుందని భావిస్తున్నారు. ఈ సమయంలో పనులు ప్రారంభం కావటంతో వర్షాలు సల్పంగా పడటంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఆపరేషన్ జీపీఎస్

10వేల పైగా వాహనాలకు జీపీఎస్ ఉండేలా చర్యలు ● వాహనదారులకు కౌన్సెలింగ్ ● ఇప్పటి వరకు 300 వాహనాలకు జీపీఎస్

ఒక వ్యక్తి ఊరు వెళ్తూ బైక్‌ను బంధువుల ఇంటి వద్ద పెట్టాడు. రెండు రోజుల తర్వాత వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు.

కొండ ప్రాంతంలో నివసించే ఓ యువకుడు ఖరీదైన బైక్‌ను కొనుగోలు చేశాడు. కొండ ఎక్కడానికి ఉన్న ర్యాంప్ వద్ద బైక్‌ను పార్క్ చేసి పైనున్న ఇంటికి వెళ్తుండేవాడు. ఈ కొత్త బైక్‌పై కన్నేసిన దొంగలు దాన్ని మాయం చేశారు.

భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన బైక్ చోరీలకు ఈ రెండు ఘటనలు ప్రత్యక్ష ఉదాహరణలు. పోలీసులు రాత్రిపూట ఎంత పటిష్ఠంగా గస్తీ నిర్వహించినా ఎక్కడో ఓ చోట బైక్ మాయమవుతూనే ఉంది. దీనితో భవానీపురం పోలీసులు ఆపరేషన్ జీపీఎస్‌కు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లోని వాహనాల భద్రత కోసం విస్తృతంగా అమలు చేస్తున్నారు. వాహనదారులకు జీపీఎస్ ప్రయోజనాలపై కౌన్సెలింగ్ చేసి వారితో ఆ పరికరాన్ని అమర్చుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ



భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఒకే కొండ ప్రాంతం ఉంది. ఇది కుమ్మరి పాలెం నుంచి సొరంగం వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో కింది నుంచి పై వరకు సుమారుగా 10వేలకు పైగా ద్విచక్ర వాహనాలున్నాయి. ఇక్కడి యువకులు ఖరీదైన బైక్‌లను కొనుగోలు చేస్తున్నారు. కొంతమందికే ఇంటి ముందు నిలుపుకునే వాహనం అవకాశం ఉంది. పైభాగంలో నివసించే వారు దిగువన గానీ, మధ్యలో నిర్మించిన ర్యాంపు వద్ద గానీ నిలుపుకుంటారు. ఈ వాహనాలకు భద్రత లేదు. ఎక్కడో ఒకచోట ఏదో ఒక వాహనం చోరీ అవుతూనే ఉంది. బైక్ కనిపించడం లేదంటూ రోజుకు రెండు ఫిర్యాదులు వస్తుండేవి. దీంతో పోలీసులు చైన్ ఆపరేషన్ మొదలుపెట్టారు. ఇది మామూలు ప్రదేశాల్లో విజయవంతమవుతోంది. కానీ కొండ ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీరికి జీపీఎస్ ద్వారా మాత్రమే రక్షణ కల్పించగలమని పోలీసులు భావించారు. కుమ్మరి పాలెం నుంచి సొరంగం వరకు ఉన్న 10 వేల ద్విచక్ర వాహనాల్లో ఇప్పటి వరకు 300కి పైగా వాహనాలకు జీపీఎస్ పరికరాన్ని అమర్చుకునేలా వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సాధారణంగా వాహనానికి జీపీఎస్ అమర్చుకోవడానికి మార్కెట్‌లో రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు. బ్లాక్ బక్ అనే సంస్థను తక్కువ ధరకు జీపీఎస్‌లు అమర్చడానికి ఒప్పించారు. ఇప్పుడు వాహనం కొత్తదైనా, పాతదైనా వాహనదారులు జీపీఎస్ పరికరం అమర్చుకోవడానికి ముందుకొస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీ చేసిన బైక్‌లను గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్నారని పోలీసులు గుర్తించారు. ఈ నేరగాళ్లు ఆంధ్ర - ఒడిశా సరిహద్దు (ఏవోబీ) ప్రాంతానికి తీసుకెళ్లి గంజాయి కోసం విక్రయిం చేస్తున్నారు.

ఫలితాలు వస్తున్నాయి..

ఉమామహేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్, భవానీపురం

కొండ ప్రాంతాల్లోని వాహనాలకు జీపీఎస్ పరికరం మాత్రమే రక్షణగా ఉంటుందని భావించాం. ఈ పరికరం ఉన్న వాహనాన్ని దొంగిలించినా ఏ ప్రాంతంలో ఉందో వాహనదారులకు ఫోన్‌కు సందేశం వస్తుంది. దీనికి అనుబంధంగా యాప్ ఉంటుంది. దాన్ని మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే ఎప్పటికప్పుడు సమాచారం తెలుస్తుంది. బైక్ స్టాండ్ తీసినా అలర్ట్ వస్తుంది. ఈ జీపీఎస్ ఆపరేషన్ మొదలుపెట్టిన తర్వాత ఫిర్యాదులు తగ్గాయి.

సాగుకు నోచని వంద ఎకరాలు

● రియల్ వెంచర్లతో రైతులకు కష్టాలు
● ప్లాట్లకు రోడ్డు కోసం కాలువలు పూడ్చివేత
● నీళ్లు పోయే దారి లేక చెరువుల్ని తలపిస్తున్న పొలాలు
● తాడేపల్లి రైతుల ఆవేదన



పొలాల్లో నిలిచిపోయిన నీళ్లను చూపిస్తున్న రైతు

వర్షాలు మొదలవడంతో ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. రైతులంతా నారు పనిలో బిజీగా ఉన్నారు. మరికొందరు పొలాలు దున్నుకుని ఇక నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే కొత్తూరు తాడేపల్లిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. తాడేపల్లి ఎర్రచెరువు కిచ్చాయకుంట సమీపంలోని మాగాణి రైతులు ఉసూరుమంటూతలలు పట్టుకుంటున్నారు. సుమారు వందకు పైగా ఎకరాల్లోని పొలాల్లో రెండేళ్లుగా నీరు నిలిచి ఉండటంతో కనీసం పొలంలోకి దిగే పరిస్థితులు లేవు. పంట పొలాల మీదుగా ప్రవహించే నీరు ఎటూ వెళ్లే దారి లేక ఎక్కడికక్కడే నిలిచి పోవడంతో పొలాలు చెరువులను తలపిస్తూ సాగుకు నోచుకోవడం లేదు. ఈ సమస్యకు కారణం అధికారుల నిర్లక్ష్యం, రియల్టర్ల నిర్వాకమేనని రైతులు ఆరోపిస్తున్నారు.

- విజయవాడ రూరల్, ఆంధ్రజ్యోతి

కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని ఎర్ర చెరువు కిచ్చాయకుంట వద్ద బుడమేరును ఆనుకుని వందకు పైగా ఎకరాల్లో మాగాణి భూములున్నాయి. ఇక్కడందరూ చిన్న, సన్నకారు రైతులే. ఏడాదికి రబీ, ఖరీఫ్ రెండు సీజన్లలో గతంలో పంటలు పండించేవారు. గత ఏడాది బుడమేరు వరదల పుణ్యమాని పొలాల వెంబడి కరకట్ట తెగి పొలాలన్నీ నీటమునిగి పంట పూర్తిగా దెబ్బతింది. అనంతరం స్థానిక రైతుల వినతుల మేరకు ఏడాదికి స్పందించిన అధికారులు ఎట్టకేలకు కట్టకు పడిన గండిని పూడ్చారు. అయితే అప్పటి నుంచి బుడమేరు నీటితో పాటుగా ఊరి వాడుకపు నీరు ఇది చాలదన్నట్టు ఇటీవల కురిసిన వర్షపు నీరు కూడా ఈ పొలాల్లోకే వచ్చి చేరాయి. సాధారణంగా వర్షపు నీరు, బుడమేరు నీరు, ఊరి వాడకపు నీరంతా ఈ పొలాల మీదుగా దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతుంది. అయితే ప్రస్తుతం ఇక్కడ ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి దిగువ ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి లేక రెండేళ్లుగా పంటలకు నోచుకోవడం లేదు.

కాలువలు పూడ్చేసిన రియల్టర్లు

కిచ్చాయకుంట మాగాణి పొలల సమీపంలో పలువురు పంట పొలాలను వెంచర్లుగా మార్చేశారు. అందులో ప్లాట్లకు దారి కోసం దిగువ ప్రాంతాలకు ప్రవహించే నీటి కాలువలను పూడ్చి వేయడంతో సమస్య ఉత్పన్నమైంది. సాధారణంగా ఎర్రచెరువు కిచ్చాయకుంట మాగాణి పొలాల మీదుగా దిగువకు వెళ్లే నీరు సమీపంలోని తుంగ చెరువులోకి చేరుతుంది. దారిమధ్యలో పంట కాలువల నిర్వాహణను అధికారులు వదిలివేయడం, రియల్ వ్యాపారులు కాలువలు పూడ్చి వేయడంతో ఎగువ ప్రాంతాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



నష్టపరిహారం ఇవ్వాలి, భోగినేని కోటేశ్వరరావు రైతు

రెండేళ్లుగా పొలాల్లో నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నాం. దమ్ము చేయడానికి లేదు. నాట్లు వేయడానికి వీలులేదు. పొలాల్లో నీరు బయటకు పోయే మార్గం చూపడంలో అధికారులు విఫలమయ్యారు. కాలువల మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలి, లేదా సమస్యను ఎదుర్కొంటున్న 60 మంది రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి.

నీరుపోయే దారి చూపాలి, కాళీ, రైతు

ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. పొలాల్లో నీళ్లు బయటకు పోయే దారి చూపిస్తే రైతులు పంటలు వేసుకునే అవకాశం ఉంటుంది. లేదంటే ఈ సీజన్‌లోనూ పంటలు వేసే పరిస్థితి కనిపించదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.





విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విద్యార్థుల బంగారు భవితకు ప్రభుత్వ తపన

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ తపనంతా మీ బంగారు భవిష్యత్తు కోసమేనని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పన చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ సూచించారు. కొండపల్లి జడ్పీ ఉన్నత (బాలికల) పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు - తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం (మెగా పీటీఎమ్ 2.0)లో ఆయన స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. చిన్నారులకు మంచి భవిష్యత్తును అందించే సంకల్పంతో మంత్రి నారా లోకేశ్ ఒక వినూత్న కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులందర్నీ ఒకచోట చేర్చి విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పీటీఎమ్ 2.0ను నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో 1,453 పాఠశాలల్లో 3 లక్షల మంది విద్యార్థులు ఉత్సాహంగా పీటీఎమ్‌లో పాల్గొన్నారన్నారు. ఈసారి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోను పీటీఎమ్ నిర్వహించామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కనిపించే ప్రోగ్రెస్ కార్డులు ఈసారి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోను హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల రూపంలో అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థినులు తల్లికి వందనం నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కోలాటాన్ని ప్రారంభించి కాసేపు కోలాటం ఆడారు. విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన తరువాత పాఠశాల ఆవరణలో మొక్క నాటారు.

హరిత శోభకు గ్రీన్ పాస్‌పోర్టు

చిన్నప్పటి నుంచే పర్యావరణం పట్ల అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం గ్రీన్ పాస్‌పోర్టు అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. విద్యార్థి నాటిన మొక్క ఆరోగ్య పరిస్థితిని బట్టి విద్యార్థికి పాయింట్స్ ఇవ్వడమే గ్రీన్ పాస్‌పోర్టు అని అన్నారు. ఇప్పటికే 61వేల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.

థింక్ బిఫోర్ యూ క్లిక్

సైబర్ దాడులకు గురవకుండా విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మత్తు అనర్థాలను ఈగల్ బృందం వివరించింది. డ్రగ్స్ వద్దు బ్రో అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఈవో యూవీ సుబ్బారావు, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ బీ రమ్య కీర్తన, విద్యా కమిటీ చైర్మన్ షేక్ బాజీబీ, హెచ్.ఎం హేమలత, ఈగెల్ సెల్ ఎస్సై ఎం వీరాంజనేయులు పాల్గొన్నారు.

గురుస్థానం పవిత్రతను తెలియజేద్దాం

విజయవాడ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో గురుస్థానం దేవుడి కంటే గొప్పదని భావించే అత్యుత్తమ సమాజంలో 'గురు బ్రహ్మ, గురుర్విష్ణుః, గురు దేవో మహేశ్వరః' అనే శ్లోకం ద్వారా గురుస్థానంలోని ప్రతి ఒక్కరితో గౌరవభావంతో వ్యవహరించడం మనలాగే మన పిల్లలకు సైతం ఈ సంస్కృతి నేర్పించాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు వెలివెల సత్యనారాయణ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా గురుదేవులకు ఆత్మీయ సత్కారం అందించేందుకు ఏపీ సృజనాత్మక సంస్థ సమితి, శ్రీదేవి నాట్యమండలి కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా షిర్డీ సాయిబాబా గురు సచ్చరిత్ర పద్య నాటకాన్ని నిర్మాత, సంగీత దర్శకుడు చింతలపూడి నాగేశ్వరరావు నేతృత్వంలో శ్రీదేవి నాట్యమండలి కళాకారులు ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. అనంతరం దర్శకుడు నిమ్మగడ్డ ఏసుపాదం, పద్యనాటక రచయిత ఉప్పులూరి లక్ష్మీనారాయణతో పాటు రంగస్థల నటులు డాక్టర్ పీవీఎస్ కృష్ణ, డాక్టర్ జే జగన్ మోహన్‌రావు, డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు, డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, పుప్పాల వీరాంజనేయులు, కే గణేష్‌కుమార్, ఉప్పాల రాజేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు జే శ్రావణ్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, తెలుగు రాష్ట్రాలకు చెందిన రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

గురు సత్కార మహోత్సవం

గురు పౌర్ణమిని పురస్కరించుకొని సత్యనారాయణపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో గురువారం గురు సత్కార మహోత్సవం ఘనంగా జరిగింది. హంసధ్వని కూచిపూడి నృత్యాలయ విద్యార్థి, విద్యార్థినులు నిర్వహించారు. నాట్యాచార్యుడు అజయ్‌కుమార్ శిష్యబృందం చక్కటి నృత్య విన్యాసాలతో ప్రేక్షకులను మెప్పించారు. స్వాగతం, గణేశ స్తుతి, చేరి యశోదకు శిశువితడు, చందనచర్చిత, అలరులు కురియగా, ఆనంద తాండవం, కట్టెదురా వైకుంఠము, తిరువీధుల మెరసి దేవదేవుడు వంటి అంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపల్ కందుల లక్ష్మీ నరసమ్మ, నాట్యాచార్యుడు పద్మశ్రీ హేమంత్, ఉషా మాధవి, భాగవతుల శైలజ, నాట్యాచార్యుడు అజయ్‌కుమార్ శిష్య - ప్రశిష్యులు పాల్గొన్నారు. నాట్యాచార్య కె.వాసుదేవరావు వ్యాఖ్యానం అందించగా, నిర్వహణలో నిహారిక, సుష్మ, దివ్య, విఘ్నేష్, తానియా, ప్రణతి సహా హంసధ్వని నృత్యాలయ శిష్య ప్రశిష్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





పద్య నాటక రచయిత ఉప్పులూరి లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న పీవీఎస్ కృష్ణ, జగన్ మోహన్‌రావు తదితరులు, నాట్యాచార్య అజయ్‌కుమార్‌కు గురు సత్కారం నిర్వహిస్తున్న శిష్య ప్రశిష్యులు

ఐక్యతతోనే సమస్యలు పరిష్కరించుకోవాలి

● రాష్ట్ర జేఏసీ చైర్మన్ విద్యాసాగర్

మచిలీపట్నం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలన్నీ ఐక్యతతో ముందడుగు వేసి సమస్యలు పరిష్కరించుకోవాలని రాష్ట్ర జేఏసీ చైర్మన్, రాష్ట్ర ఎన్జీవోల సంఘ అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. ఎన్జీవో హోంలో గురువారం రాత్రి వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నేతలతో ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ నూతన పీఆర్సీ కమిషన్ వేయాలని సీఎం చంద్రబాబు, ప్రిన్సిపల్ సెక్రటరీని అడిగామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నిర్వహించిన ఉద్యమాలలో నేతలపై వేలాది కేసులు బనాయించారని, వాటిని రద్దు చేయాలని కోరామని, అందుకు సీఎం స్పందించి త్వరలో రద్దవుతాయన్నారు. సీపీఎస్ విధానంపై కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాయని, అలాగే కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరామన్నారు. 62ఏళ్ల రిటైర్‌మెంట్ ఎవరూ కోరలేదని, అప్పటి ప్రభుత్వమే నిర్ధారించిందన్నారు. అయితే గురుకుల విద్యాలయాల్లో పనిచేసే టీచర్లు 3700 మందికి పెంచలేదన్నారు. మొత్తం మీద ఇంకా 7600 మంది ఉద్యోగులకు రిటైర్‌మెంట్ వయసు 62కు పెంచాలన్నారు. 2004 ముందు ఉద్యోగుల నోటిఫికేషన్ సీపీఎస్ అంశం లేదని, తరువాత నియమించిన ఉద్యోగులందరికీ ఓపీఎస్ విధానం కల్పించాలన్నారు. దేశంలో 17 రాష్ట్రాలు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానం ప్రవేశపెట్టిందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం 11వేల మంది ఉద్యోగులకు ఓపీఎస్ విధానం అమలు చేయాలన్నారు. హెల్త్‌కార్డులు ఉపయోగపడటం లేదన్నారు. ఉద్యోగులు కడుతున్న డబ్బును ఎన్టీఆర్ ట్రస్టుకు జమ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో 20 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ ఆరోగ్యంపై ఎల్‌ఐసీ విధానాన్ని తీసుకురావాలని కోరామని, అందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. నేతలు ఉల్లి కృష్ణ, శ్రీనివాసరావు, కేపీ ఉమామహేశ్వరరావు, శరశ్చంద్ర పాల్గొన్నారు. కాగా రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ చిలకలపూడి పాండురంగస్వామిని దర్శించారు. అక్కడి నుంచి ఎన్జీవో హోం వరకు ఉపాధ్యాయ సంఘ నేతలు పెద్ద ఎత్తున ర్యాలీగా తీసుకొచ్చి ఘనంగా సత్కరించారు.




జేఏసీ సమావేశంలో ఎన్జీవోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ చైర్మన్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణ, నేతలు

112 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: ట్రాన్స్‌జెండర్ (హిజ్రా)లకు సమాన అవకాశాలు కల్పించే దిశగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికార మంత్రిత్వ శాఖ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్-2020 చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ట్రాన్స్‌జెండర్లను గుర్తించి వారి అభ్యున్నతికి దోహదపడటానికి ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం వారికి ప్రత్యేక ఐడెంటిటీ కార్డులను జారీ చేస్తోంది. సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురైన వీరికి విద్యా, వైద్య, ఉద్యోగ అవకాలు కల్పించి అభివృద్ధి దిశగా నడిపించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. ఈ చట్టం ట్రాన్స్ పట్ల వివక్షత, హింసను వ్యతిరేకిస్తుంది.

జిల్లాలో దాదాపు 10వేల మంది..

జిల్లాలో దాదాపు 10వేల మందికి పైగా ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారనేది అధికారుల ప్రాథమిక అంచనా. సమాజ స్థితిగతులను అంచనా వేయగలిగిన కొందరు ఓటు హక్కు కల్పించాలని కోరుతూ 2024 ఎన్నికల ముందు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వీరికున్న హక్కులను మాత్రం తెలుసుకోలేక పోతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నూతన చట్టం ప్రకారం వీరంతా గుర్తింపు కార్డులు పొందవచ్చు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చొరవతో 112 మంది మాత్రమే కార్డులు పొందగలిగారు. తద్వారా ఉచిత ఇల్లు, విద్య ఉద్యోగం, వైద్యంతో సమాన అవకాశాలు పొందడంతో పాటు విమర్శలు, సవాళ్లను దీటుగా ఎదుర్కొనే అవకాశం ఉంది.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

పెండింగ్ కేసులను పరిష్కరించాలి : సుబ్రహ్మణ్యం

గుడివాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి) : కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా దేశం కోసం మధ్యవర్తిత్వం కార్యక్రమంలో పరిష్కరించుకోవాలని మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఏలూరురోడ్డులోని కోర్టు భవనాల సముదాయం వద్ద దేశం కోసం మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎస్.వాసుదేవ్, అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి అరుంధతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మలచర్ల శ్రీనివాసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం

విద్యతోనే సమాజ ఉన్నతి సాధ్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


నందివాడలో ..

ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ సమావేశాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నందివాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశనుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం వల్ల సమాజంలో ఉన్నత స్థాయిలో ఉంటారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం తల్లికి వందనం కార్యక్రమం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ తల్లులకు ముగ్గుల పోటీలు కార్యక్రమాలు నిర్వహించి కార్యక్రమం అనంతరం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రుద్రపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. వెనిగండ్ల, విద్యార్థులకు, తల్లిదండ్రులకు, మధ్యాహ్న భోజనం వడ్డించారు. అనంతరం విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు కళాశాల ప్రిన్సిపల్ పీటీ సాల్మన్‌రాజు, ఎంఈవో-2 డేవిడ్ రత్న రాజు, హెచ్ఎం రవి, మణి, కృష్ణ లీలా కుమారి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి, పిన్నమనేని బాబ్జీ, దానేటి సన్యాసిరావు, ఏసుబాబు, రూరల్ ఎంపీడీవో విష్ణుప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : ఉన్నతమైన ఆలోచనలతో చదివితేనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పెనమకూరు జడ్పీ హైస్కూల్లో గురువారం మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో మండలంలో మొదటి ర్యాంకు సాధించిన భవ్యశ్రీకి ప్రత్యేక బహుమతి అందించి, ఆ విద్యార్థిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఆలరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు శివ మధుబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, జనసేన నాయకుడు తాడిశెట్టి నరేష్, ఎంఈవో జి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్ ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి హాజరై విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు అందించారు. వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు తల్లులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సురేష్, హెచ్ఎం ఫణి రాజమోహన్, విద్యా కమిటీ చైర్మన్ సుజాత తదితరులు పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో..


గుడివాడ రూరల్‌లో..

గుడివాడ రూరల్ : తల్లిదండ్రులు పిల్లలను చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పించాలని గూడూరు మండల తహసీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. బిళ్లపాడులో ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత గూడూరు మండల తహసీల్దార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్య నేర్చుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తామని తెలిపారు. కనీస వసతులు లేకపోయినా గంగాధరపురం పాఠశాలలో చదివి గూడూరు మండల తహసీల్దార్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొబ్బిలి సూర్యనాగేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు. మోటూరు గురుకుల ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో విష్ణుప్రసాద్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరిగింది.

కూచిపూడి : విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ జడ్పీ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మండవ నాగేశ్వరరావు రూ.60 వేలు నగదు ప్రోత్సాహకాలు అందించగా, నందిపాటి వెంకట కృష్ణారావు, శ్రీనివాసులు రూ.17 వేలను అందించారు. గ్రామసర్పంచ్ తూము పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, ఎంపీడీవో సుహాసిని, ఎంఈవో శ్రీలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ బాబురావు, హెచ్ఎం నిమ్మగడ్డ ఉమశ్రీ తదితరులు పాల్గొన్నారు. కూచిపూడి జడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లులకు పాదాభివందనం చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. సర్పంచ్ కె.విజయలక్ష్మి, అమర బాలేశ్వరరావు, హెచ్ఎం భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


కూచిపూడిలో..

పామర్రు: గురువారం నిమ్మకూరు ఏపీఆర్‌జేసీ కళాశాలలో నిర్వహించిన మెగా2.0పేరెంట్స్ సమావేశంలో ఎంపీపీ దాసరి అశోక్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులు, తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో కృష్ణాడెల్టాప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్,ఎస్సై రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. పామర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో గ్రామ సర్పంచ్ కె.కస్తూరి మాట్లాడారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులందజేశారు. పామర్రులో జరిగిన కార్యక్రమంలో వల్లూరిపల్లి చక్రవర్తి, బొమ్మారెడ్డి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే యువత కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సతీమణి వెనిగండ్ల సుఖదా పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, పాల్గొన్నారు. స్థానిక ఏకేటీపీ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశాభివృద్ధికి వెన్నెముక అని విశ్రాంత అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శాయన సుశీల్‌రావు అన్నారు. గురువారం స్థానిక ఏఏఎన్ఎం అండ్ వీఆర్ఎస్ఆర్ ఉన్నతపాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి గుడ్లవల్లేరు ఏజేఎల్ నరసింహారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ గుడ్లవల్లేరు శాఖ అధికారి టి.వాణి, ప్రిన్సిపాల్ కుంజుమన్, పాల్గొన్నారు.


గుడివాడలో..

ప్రతి ఇంటికీ చేసిన మంచి తెలియాలి

● ఎమ్మెల్యే కుమార్‌రాజా, ఎమ్మెల్సీ సత్యన్నారాయణరాజు

తోట్లవల్లూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగా ప్రతి ఇంటిని దర్శించి కరపత్రాలను అందించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఎమ్మెల్సీ మంతెన సత్యన్నారాయణరాజు కోరారు. వల్లూరుపాలెంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వారిరువురు పాల్గొని ప్రజలను కలుసుకున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, రాష్ట్ర టీడీపీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కాట్రగడ్డ రవి, ఉప్పులూరి గోపాలకృష్ణ, యేమినేని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నందివాడ : రాష్ట్రంలోని మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఈ సందర్భంగా గురువారం పోలుకొండలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కురమ శ్రీనివాసరావు అధ్యక్షతన డోర్ టూ డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మానేపల్లి ఝాన్సీ కుమారి, ఉప్పల వెంకటేశ్వరరావు, ఏసుబాబు, గంగయ్య, బాబుజీ, ఏసు, శ్రీనివాసరావు, చాట్రగడ్డ రవి తదితరులు పాల్గొన్నారు.


నందివాడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల


వల్లూరుపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా, ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు

పమిడిముక్కల: వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. మద్రివాడలో సుమారు రూ. 26లక్షల అంచనాతో నిర్మించిన సీసీ రోడ్లు బుధవారం స్థానిక నాయకులతో కలసి ప్రారంభించి ఇతర అభివృద్ధి పనులకు పూజలు చేశారు. గ్రామంలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఇంటింటికీ తిరిగి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ ఫ్రాన్సిస్, టీడీపీ నా యకుడు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం

● ఏనుగులకోడు డ్రెయిన్ వంతెన వింగ్‌వాల్స్ పునర్నిర్మాణం ● పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కుమార్ రాజా

తోట్లవల్లూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి) : పెనమకూరు ఏనుగులకోడు డ్రెయిన్ వంతెన దుస్థితిని మారుస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చానని, సీఎం చంద్రబాబునాయుడు అత్యవసర కోటాలో రూ. 94 లక్షలు నిధులు మంజూరు చేయటంతో 12 నెలల్లోనే పునర్నిర్మాణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలం పెనమకూరు వద్ద ఏనుగులకోడు డ్రెయిన్‌పై గల వంతెన వింగ్‌వాల్స్ పునర్నిర్మాణ పనులకు గురువారం భూమి పూజ చేశారు. దశాబ్ద కాలంపైగా వంతెన నాలుగు వైపుల వింగ్‌వాల్స్ పడిపోయి ప్రజలు ఎంతో ప్రమాదకర పరిస్థితిలో రాకపోకలు సాగిస్తున్నారని స్థానికుడైన మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శిరామ్‌ప్రసాద్ తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. దీంతో వంతెన వింగ్‌వాల్స్ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా నిధులు విడుదల చేయటం సంతోషకర విషయమని ఎమ్మెల్యే అన్నారు. నాలుగు వైపులా వింగ్‌వాల్స్ నిర్మాణ పనులను త్వరగానే పూర్తవుతాయని, రాకపోకలు సాగించే ప్రజలు కాంట్రాక్టరుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

అలాగే భవిష్యత్తులో బందరుకాలువ, ఏనుగులకోడుపైగా ఏక వంతెన నిర్మాణానికి కృషి చేయనున్నట్టు కుమార్ రాజా తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు శివ మధుబాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్ పిట్టు వెంకటేశ్వరరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వీరంకి పరశురామ్, చిగురుపాటి సుబ్రహ్మణ్యం, వీరంకి వరహాలరావు పాల్గొన్నారు.

ప్రజలందరిపై జగన్మాత దీవెనలుండాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, జూలై 10(ఆంధ్రజ్యోతి) : జగన్మాత కొండాలమ్మ అమ్మవారి చల్లని కరుణాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో రైతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. వేమవరంలో వేంచేసియున్న కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న శాకంబరీ దేవి వేడుకల్లో గురువారం ఎమ్మెల్యే వెనిగండ్ల, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి పాల్గొని ఆషాఢ సారెను సమర్పించారు. దేవాదాయ శాఖ అధికారులు దేవస్థాన సాంప్రదాయం ప్రకారం శేషవస్త్రంతో సత్కరించి అమ్మవారి ఫోటో, లడ్డూ ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డు చైర్మన్ పొట్లూరి రవి, దేవస్థాన ఈవో ఆకుల కొండలరావు, పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : చౌటపల్లిలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా పార్వతీ అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ అర్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్యం, ఆలయ ఈవో జి.శిరీష ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు.


ఆషాఢ సారెను తీసుకుని వస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి

రైతులు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఏవో శివనాగరాణి

పామర్రు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రారంభమైన ఖరీఫ్ సీజన్లో రైతులు తాము సాగుచేసిన పంటలకు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని పామర్రు మండల వ్యవసాయాధికారిణి విశ్వనాథపల్లి శివనాగరాణి పిలుపునిచ్చారు. పామర్రు రైతుసేవా కేంద్రంలో గురువారం పలు అంశాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరిసాగుచేసే రైతులు రూ.830 ప్రీమియం ఆగస్టు 15లోగా చెల్లించాల్సి ఉందన్నారు. దీంతోపాటుగా పంటనమోదు (ఈ క్రాప్) తప్పనిసరి చేసుకోవాలన్నారు. అర్హులైన కౌలుదారులందరూ గ్రామాల్లోని వీఆర్వోల వద్ద కౌలు కార్డులు పొందాలని కోరారు. వీఏఏలు శ్రావణి, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి

గుడివాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి) : గురుపౌర్ణమి సందర్భంగా గురువారం స్థానిక ధనియలపేటలోని ప్రణావాశ్రమంలో స్థైర్యానందస్వామిని టూటౌన్ బీజేపీ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఆధ్వర్యంలో ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ సత్కరించారు. బీజేపీ మచిలీపట్నం పార్లమెంటరీ ఇన్‌చార్జ్ సూరే గాంధీ పాల్గొన్నారు. గౌరీశంకరస్వామి దేవస్థాన ఉపాలయమైన షిర్డీ సాయి బాబా మందిరంలో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు పాల్గొన్నారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో బాబాకి అష్టోత్తరాలతో అభిషేకాలు నిర్వహించారు. ధనియాలపేటలో టీడీపీ నాయకులు సాంబశివరావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగరాజుల ఆధ్వర్యంలో పేదలకు నూతన వస్త్రాలను అందజేశారు.

కూచిపూడి: గురు పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని పెదపూడి, నిడుమోలు, కోసూరు గ్రామాల్లోని ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పామర్రు : పామర్రులో వేంచేసియున్న సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేకపూజలు,అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు, పెనమకూరు, గరికపర్రు, కనకవల్లి, భద్రిరాజుపాలెం గ్రామాల్లో గురువారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులు సహపంక్తి భోజనాలు చేశారు.

గుడివాడ : స్థానిక పెద్దకాలువ సెంటర్‌లో వేంచేసియున్న హనుమత్ సమేత దత్తసాయి సేవాసంఘం ఆధ్వర్యంలోని షిర్డీసాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ వల్లూరుపల్లి లక్ష్మీ సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

మండలంలోని కవుతరం శ్రీసాయిసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం కాగడా హారతి, పంచామృత అభిషేకాలు, పూలాభిషేకాలు, శ్రీగణపతి హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కానూరి బాలకృష్ణమోహన్(బాలు), రాధికారత్న దంపతులు, బొబ్బా చక్రవర్తి, గిరిజ దంపతులు గణపతి హోమం, సాయి హోమం నిర్వహించారు. గుత్తికొండ శ్రీనివాస్ అందించిన రూ.1లక్ష వితరణతో శ్రీషిర్డీసాయి సేవా ట్రస్ట్ సౌజన్యంతో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.


గుడివాడలో ప్రత్యేక పూజలు చేస్తున్న సేవాసంఘం సభ్యులు

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

గుడివాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు 37 బృందాలుగా ఏర్పడి నగర పరిధిలో 3244 గృహ సర్వీసులు, 164 వాణిజ్య సముదాయాల్లో తనిఖీలు నిర్వహించి, అదనపు లోడ్ 459 కేవీ మొత్తానికి రూ.9.18లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఏపీసీపీడీసీఎల్ గుడివాడ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. ఏలూరురోడ్డులోని ఈఈ కార్యాలయంలో గురువారం వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేయడం సామాజిక నేరమని, చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి తప్పుకు కాంపౌండింగ్ పద్ధతిలో మినహాయింపు ఇచ్చిన, రెండవసారికి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతామని స్పష్టం చేశారు. విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు తెలిస్తే సెల్ నెంబర్లు 94408 12091, 94408 12362, 94408 12363కు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో గుడివాడ డీఈఈ బి.నాగబాపిరాజు, గుడివాడ ఏఈ బ్రహ్మానందరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీలను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

వైద్యుల సమస్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న ఉదయభాస్కరరాజు

గుడివాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వైద్యుల సమస్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామన్న ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ ప్రకటన పట్ల బీహెచ్ఎం ఫెడరేషన్ ఆఫ్ ఫస్ట్ ఎయిడ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు సాగిరాజు ఉదయభాస్కరరాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక పామర్రు రోడ్డులోని లైఫ్ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 25వ తేదీన ప్రధాన ఫెడరేషన్‌లతో శ్రీశైలంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. బీహెచ్ఎంపీ రాష్ట్ర నాయకులు కొరెళ్ల గణపతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో బీహెచ్ఎంఎంపీ జిల్లా గౌరవాధ్యక్షుడు కోలా వెంకటేశ్వరరావు, కార్యదర్శి సింహాచలం, వర్కింగ్ అధ్యక్షుడు నాగచంద్రశేఖర్, మేదూరి రమేష్‌బాబు, గుడివాడ ప్రాంతీయ కోశాధికారి ప్రదీప్ కుమార్, పాల్గొన్నారు.

అంగన్వాడీలకు పిల్లలను పంపించాలి

పమిడిముక్కల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు వినోద, విజ్ఞాన కార్యక్రమాలు, ఇంగ్లీషుపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సలీమున్నీసా అన్నారు. అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం నారాయణపురంలో చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించారు. ముళ్లపూడిలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆటపాటలు, విజ్ఞాన, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషా పాల్గొని మాట్లాడారు.

ద్విచక్రవాహనం చోరీ

గుడివాడ : అగ్నిమాపక శాఖ పెట్రోల్ బంకు వద్ద పార్కు చేసిన ఏపీ 39డీఆర్ 1441 నెంబరు గల యాక్టివా ద్విచక్రవాహనం చోరీకి గురైనట్టు బాధితుడు గోళ్ల సోమేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ పి.బాబురావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220
నెక్ కోడిగుడ్డు ధర	(100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం : మంత్రి రవీంద్ర



మచిలీపట్నం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా, ఈనెల 16న ఆంధ్రజాతీయ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.టీడీపీ కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారికి శిక్షణ నిర్వహిస్తామన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, హసీంబేగ్, మరకాని సమతాకీర్తి, లోగిశెట్టి వెంకటస్వామి, ఇలియాస్‌పాషా, మాదివాడ రాము, కరెడ్ల సుశీల పాల్గొన్నారు.



లేడీయాంప్తిల్ కళాశాలలో పేరెంట్ టీచర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి



కోడూరు పాఠశాలలో తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

ఉత్తమ పౌరుల రూపకల్పనే లక్ష్యం

మచిలీపట్నం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నైతిక విలువల పెంపు, ఉత్తమ పౌరుల రూపకల్పన లక్ష్యంగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. లేడీయాంప్తిల్ జూనియర్ కళాశాల, బాలికల హైస్కూల్‌లో గురువారం మెగా పేరెంట్ టీచర్ కార్యక్రమంలో మంత్రి రవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, నవసమాజ నిర్మాణానికి ప్రభుత్వ పాఠశాలల్లో పునాదులు వేస్తున్నామన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, ఇంటర్ బోర్డు జిల్లా అధికారి సరళకుమారి, కళాశాల లెక్చరర్ లంకిశెట్టి హరనాథ్‌బాబు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, ఆర్టీసీ డిపో మేనేజరు పెద్దిరాజు, మరకాని పరబ్రహ్మం, లోగిశెట్టి వెంకటస్వామి, గనిపిశెట్టి గోపాల్ పాల్గొన్నారు. చిన్నాపురంలో తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, కాగిత గోపాలరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచే నాని, ఎస్‌ఎంసీ చైర్మన్ కేశవ కృష్ణ, నిరంజనరావు సత్కరించారు. కానూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో గోపు సత్యనారాయణ విద్యార్థులు, తల్లిదండ్రులతో సహపంక్తిభోజనం చేశారు. దివి మహేష్, పీతా రాము పాల్గొన్నారు. పవిత్ర డిగ్రీ కళాశాలలో తెలుగు యువత ఉపాధ్యక్షుడు హసీంబేగ్, పోతేపల్లి ఎంపీపీ పాఠశాలలో యోగా మాస్టర్ డాక్టర్ మల్లికార్జునుడు, రుస్తుంబాద మునిసిపల్‌పాఠశాలలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నిర్మలా కాన్వెంట్ జరిగిన సమావేశంలో ఏఎస్పీ వి.వి.నాయుడు, బందరు డీఎస్పీ రాజా తదితరులు విద్యార్థులతో ముచ్చటించారు. **అవనిగడ్డ :** అవనిగడ్డ జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్, ఎంపీపీ స్కూల్, ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు తల్లులకు పాదపూజ చేశారు. ప్రత్యేకాధికారి సాయిబాబు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి, డీఎస్పీ టి.విద్యశ్రీ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, స్వర్ణకుమారి, షేక్ నజీర్ బాషా, మత్తి శ్రీనివాసరావు, ఎంఈవోలు శివశంకర్‌రావు, అన్నపరెడ్డి పిచ్చియ్య, ప్రిన్సిపాల్ దొరబాబు, ప్రధానోపాధ్యాయులు కందుల సుజాత, ఎం.నాగమల్లేశ్వరరావు, బి.పరమేశ్వరరావు, నక్కా విజయ్‌బాబు, నారేపాలెం శంకరరావు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు. **పెడన :** భట్ల జ్ఞానకోటయ్య జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లులకు విద్యార్థులచే పాదాభివందనం చేయించారు. గొట్టుముక్కల రఘురామరాజు, యక్కల శ్యామలయ్య, కట్టామూర్తి, హెచ్ఎం ఎల్ ఇందిర, ఉపాధ్యాయ సంఘ నేత ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. మొత్తం 80 పాఠశాలల్లో పీటీఎం నిర్వహించారు. **నాగాయలంక :** భావదేవరపల్లి జడ్పీ పాఠశాల సమావేశంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భోగాది అప్పారావు కుమార్తె ఝాన్సీలక్ష్మీ వితరణ చేసిన కంప్యూటర్, ప్రింటర్, డెస్కులను మండలి ప్రారంభించారు. ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, రామదాసు, ఏ.రామారావు, ఎం.రవిచంద్ర, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు. మారుతీ విద్యానికేతన్‌లో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ ఎస్టీపీ కుమార్ అధ్యతన సమావేశం నిర్వహించారు. సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, ఎంపీఈవో మరియకుమారి, గ్రామ ప్రముఖులు మండలి సుధీర్, పీఈటీ వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు తల్లులకు పాదాభివందనం చేసి ఆశీర్వచనం తీసుకున్నారు. అశ్వారావుపాలెం ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ డే నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రవికిరణ్, సర్పంచ్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్ ఉపసర్పంచ్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కోడూరు :** కోడూరులోని పాఠశాలల్లో ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. వివిధ అంశాల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** మెగా పేరెంట్స్ డే పండుగ వాతావరణంలో జరిగింది. విద్యార్థుల నడవడికను తల్లిదండ్రులు గమనిస్తూ ఉం డాలన్నారు. బంటుమిల్లి, పెదతుమ్మిడి, అర్తమూరు, పెందుర్రు తదితర పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. **చల్లపల్లి :** నారాయణరావునగర్‌లోని మోడల్ పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీట్‌లో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఎంఈవో పి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ కనకదుర్గను హెచ్‌ఎం కైతేపల్లి దాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. విజయ జూనియర్ కళాశాల, శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలల్లో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్స్ పెమ్మసాని రమేష్‌బాబు, షేక్ అబ్దుల్ రహీం పాల్గొన్నారు. విజయా అకాడమీలో జరిగిన సమావేశంలో కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు పాల్గొన్నారు. ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో జరిగిన సమావేశంలో తల్లిదండ్రులకు మొక్కలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ జి.మధుసూదనరావు, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పురిటిగడ్డ జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో అమ్మకు వందనం కార్యక్రమంలో సర్పంచ్ మాతంగి రమ్య, జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయరావు, హెచ్‌ఎం కెబిఎన్.శర్మ, రాజులపాటి శివప్రసాద్, యాజమాన్య కమిటీ బృందం పాల్గొన్నారు. **మోపిదేవి :** కొక్కిలిగడ్డ మోడల్ ప్రైమరీ స్కూల్, జడ్పీ హైస్కూల్‌లో గురువారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పరిశె రాంబాబు, వల్లు నాగమణి అధ్యక్షత వహించగా, ఎంపీపీ దుర్గావాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు మాతృమూర్తి శ్యామలమ్మ జ్ఞాపకార్థం 140 మందికిపైగా విద్యార్థులకు డైరీలను ఎంపీపీ దుర్గావాణి, రావి నాగేశ్వరరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. చందన రంగారావు, విద్యా కమిటీ చైర్మన్ వాకా దుర్గారావు, వైస్ చైర్మన్ సుమలత పాల్గొన్నారు.



పెడనలో బహుమతులందజేస్తున్న కాగిత, నారాయణరావునగర్‌లో కనకదుర్గకు సత్కారం

తాడేపల్లి మళయాళస్వామి ఆశ్రమంలో వేద పాఠశాల

● దరఖాస్తుల ఆహ్వానం

ఘంటసాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లి మళయాళ స్వామి ఆశ్రమ ప్రాంగణంలో వేద పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు కన్వీనర్ కావూరి కోదండ రామయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యాసాశ్రమం, కేంద్రీ య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జాతీ య సంస్కృత యూనివర్సిటీ సహకారంతో సనాతన ధర్మ వేద పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేదపాఠశాలలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన అన్ని కులాలకు చెందిన భారతీయ సనాతన ధర్మాన్ని విశ్వసించే విద్యార్థుల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కూడా యాజమాన్యమే కల్పిస్తుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జూలై నెలాఖరులోపు తమ దరఖాస్తులను మలయాళ స్వామి పెద్దాశ్రమం, తాడేపల్లి, ఘంటసాల మండలం, కృష్ణా జిల్లా కార్యాలయానికి అందజేయాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 70756 65766కు సంప్రదించాలన్నారు. మొవ్వ రామ్మూర్తి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా శివప్రసాద్

పెడన రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా కటకం శివప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. డ్వామాలో పనిచేస్తున్న శివప్రసాద్ పదోన్నతిపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.



పులిగడ్డలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న కనపర్తి, బొబ్బా

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

అవనిగడ్డ రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పేదరికం నిర్మూలనే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ధ్యేయమని నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్ అన్నారు. పులిగడ్డలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, రావి రత్నగిరి, మండలి రామ్మోహన్‌రావు, బండే రాఘవ, మేడికొండ విజయ్, గుంటూరు వినయ్, నాగిడి రాంబాబు, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, చందన రంగారావు, బళ్ల ప్రసాద్, నాగిడి శివ నాగేశ్వరరావు, నాగిడి వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ నాగబాబు, చెన్ను ఆబురావు, చెన్ను అంజనేయులు, నాగిడి రాజా తదితరులు పాల్గొన్నారు.



కోడూరులో సుపరిపాలనలో తొలి అడుగు..

కోడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ఆపలేదని, దివి మార్కెటింగ్ యార్డు చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. మూడో వార్డులో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. పూతబోయిన శ్రీనివాసరావు, కాగిత ప్రసాద్, పాశం పాండురంగారావు, పిల్లి మల్లికార్జునరావు, అప్పికట్ల రవీంద్ర, కస్టర్ ఇంచార్జ్ ఇమ్రాన్, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, తోట సాంబయ్య, రేపల్లె ప్రతాప్, చింతల రమేష్ పాల్గొన్నారు.



పోసినవారిపాలెం, బల్లిపర్రులో..

గూడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పోసినవారిపాలెంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి రజని, సిరివెళ్ళ శ్రీను, గోపీ నాగబాబు, కాసగాని శ్రీనివాసరావు, ఎస్‌ఎ బేగ్, గంజాల గోవర్ధన్, అన్నం హరిరామకృష్ణ, తమ్మన శ్రీనివాసరావు, జన్ను ప్రసాద్, కట్టా మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **పెడన రూరల్ :** బలిపర్రు గ్రామంలో కూటమి నాయకులతో కలిసి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రజలకు వివరించారు. శలపాటి ప్రసాద్, సర్పంచ్ జోగి నాగవరలక్ష్మీ, అర్జంపూడి సత్యనారాయణ, వాసన కుమారస్వామి, జోగి వెంకటరమణ, జోగి రమేష్, సమ్మెట సత్యం, రమేష్ పాల్గొన్నారు.



తహసీల్దార్ విజయప్రసాద్‌కు సత్కారం

ఘంటసాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి రెడ్‌క్రాస్ సేవా అవార్డు అందుకున్న తహసీల్దార్ బి.విజయప్రసాద్‌ను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవాలన్న కల నెరవేరిందన్నారు. బుల్లా కిషోర్, దిరిశం వెంకట్రావు, మునిపల్లి బుజ్జి, దోనె వెంకటేశ్వరరావు, దాసి సీతారామరాజు, తూము వెంకటేశ్వరరావు, డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





పెదకళ్లేపల్లిలో దుర్గాదేవికి శాకంబరీ అలంకారం, ఆషాఢ సారె సమర్పిస్తున్న గ్రామస్థులు



చల్లపల్లిలో అంకమ్మతల్లికి సారె సమర్పిస్తున్న భక్తులు

శాకంబరిగా దుర్గమ్మ..సారె సమర్పణ

మోపిదేవి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పెదకళ్లేపల్లి దుర్గా నాగేశ్వర స్వామివారి దేవాలయంలో దుర్గా అమ్మవారికి శాకాంబరి అలంకారం చేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు బుద్దు ప్రసాద్, విజయ్ కుమార్ నేతృత్వంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్లకు కూరగాయలు, పండ్లు, పూలతో అలంకరించారు. పెదకళ్లేపల్లి గ్రామస్థులు ఆషాడ మాస సారెను అమ్మవార్లకు సమర్పించారు. మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం వేదపండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ తన తండ్రి నౌడూరి వెంకట రామలింగ శాస్త్రి జ్ఞాపకార్థం రూ.30 వేలతో స్వామి, అమ్మవారి అలంకరణకు కూరగాయలు, పండ్లను వితరణగా అం దజేశారు. ప్రతి సంవత్సర శాకంబరి అలంకరణకు సుబ్రహ్మణ్య శర్మ కూరగాయలు, పండ్లు, పూలు వితరణగా అందజేస్తున్నారు. విజయవాడకు చెందిన ప్యూర్ ఓ నాచురల్ ఫ్రూట్ షాప్ అధినేత బొర్రా సుధీర్ రూ.15 వేలు విలువ గల కూరగాయలు,పండ్లు అందజేశారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాద్, ఆలయ అధికారి తోట చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** లంకమ్మ అమ్మవారికి మూడో వార్డు ప్రజలు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. పోతరాజు గుడి చుట్టూ ప్రదర్శనలు చేశారు. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ, స్వీట్లు, పండ్లు సమర్పించారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **పెడన :** పాతపేటలోని ముత్యాలమ్మతల్లి (ఘటంగుడి) ఆలయం లో అమ్మవారు గురువారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాయగూరలు, పండ్లు, ఆకుకూరలతో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. తోట పైడేశ్వరరావు, నాగరాజు, మహశ్రీకుమార్, చందన నారాయణరావు, సూదాబత్తుల విష్ణు, ఊటుకూరి హేమానంద్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** కోడూరులోని కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు ఆషాఢ మాసం సందర్భంగా సారె సమర్పించారు. వంద మందికి పైగా భక్తులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి 300 కేజీల స్వీట్లు, పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి, చీర, రవిక, పళ్లు, పూలు తీసుకువచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించగా, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** వేముల వారి ఆడపడుచులు వేముల వారి అంకమ్మ తల్లికి ఆషాఢ సారె సమర్పించారు. డప్పువాయిద్యాల తో ఊరేగింపుగా తరలి వెళ్లి గ్రామదేవత సంపటాలమ్మకు పూజలు చేసి అనంతరం అంకమ్మ తల్లికి సారె సమర్పించారు. ఉప్పల వారి రామాలయం నుంచి ఉప్పల వారి మహిళలు ఆషాఢ సారెను జమ్మిలంక అంకమ్మకు సమర్పించారు. నారాయణరావు నగర్, అగ్రహారం ప్రాంత మహిళలు గ్రామదేవత సంపటాలమ్మ తల్లికి ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు అమ్మవారికి పూజలు చేశారు.



కోడూరులో కనకదుర్గమ్మకు సారె తీసుకెళ్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

మచిలీపట్నం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గురువారం శంకరమఠంలో జరిగిన గురుపూజోత్సవంలో తిరుపతికి చెందిన వేదపండితులు డాక్టర్ యజ్ఞేశ్వర సోమయాజులు ఆధ్యాత్మిక ప్రసంగం, గురు విశిష్టతను వివరించారు. వేదపండితులు విష్ణుభట్ల సూర్యనారాయణశర్మ, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు. ఉదయపు నడక మిత్రమండలి హాలులో జరిగిన సమావేశంలో యోగ మాస్టర్లు ఘంటసాల గురునాథబాబు, సీతామహాలక్ష్మి దంపతులను కమిషనర్ బాపిరాజు సత్కరించారు. పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** గురుపౌర్ణమిని వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లోని షిర్డి సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. పురిటిగడ్డ శ్రీకృష్ణసాయి ధ్యానమందిరంలో బాబాకు అభిషేకాలు, దత్త హోమం జరిగాయి. ప్రవాస భారతీయులు డాక్టర్ వెలగపూడి మోహనకృష్ణ, సజ్జా వెంకట రాజన్ కుమార్తె సజ్జా దీప్తి సహకారంతో అన్నసమారాధన జరిగింది. పాగోలు కైవల్యాశ్రమ ప్రాంగణంలోని అచలేశ్వర కమలాత్మికా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అచలేశ్వరస్వామికి నిర్భయానంద స్వామి అభిషేకాలు, గురు పాదుకాపూజ, ప్రార్థనలు, సత్సంగము జరిగాయి. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ట్రస్టీ మేకా బంగారుబాబు దంపతులు, ట్రస్టు సభ్యులు చాపరాల గాంధీప్రసాద్, ట్రస్టు ప్రతినిధులు,పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ షిర్డి సాయిబాబా ఆలయంలో సామూహిక సత్య వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఐదు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు నరసింహారావు, దుర్గారావు పర్యవేక్షించారు. **నాగాయలంక :** నాగాయలంక, భావదేవరపల్లి, నంగేగడ్డ, కమ్మనమోలు, తలగడదీవిలోని షిర్డి సాయి బాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆలయానికి విచ్చేసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్త తుటారం చక్రవర్తి - ధనలక్ష్మి దంపతులు ఎమ్మెల్యేని సత్కరించారు. మండలి బుద్ధప్రసాద్, పూషడపు నిరంజనరావు, తుటారం రాము, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కమ్మనమోలులోని బాబా మందిరంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. **కోడూరు :** కోడూరు షిర్డి సాయి దివ్య ధ్యాన జ్ఞాన మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. పంచామృత అభిషేకం, గోక్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహా అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు కుటుంబసమేతంగా సాయినాథుని దర్శించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రేపల్లె వెంకట నారాయణ (రఘు) పర్యవేక్షించారు. **ఘంటసాల :** గురు పౌర్ణమి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. తాడేపల్లిలోని మలయాళ స్వామి పెద్దాశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక ప్రముఖులు మొవ్వ శ్రీరామ్మూర్తి, మహిళలు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** మూడో వార్డులో లక్ష్మీ దత్త సాయి మందిరంలో విక్కుర్తి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైన ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు విక్కుర్తి తెలిపారు. విక్కుర్తి రాంబాబు, బర్మా శ్రీనివాసరావు, రేపల్లె ముసలయ్య, బర్మా బుజ్జి, బొప్పన హరికిరణ్, వి.రాజా పాల్గొన్నారు. **కృత్తివెన్ను :** సాయిబాబా ఆలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగమూడి, కొమాళ్లపూడి, లక్ష్మీపురం గ్రామాల్లో సాయి బాబాకు అభిషేకలు నిర్వహించి, అన్నసమారాధలు జరిపారు.



పులిగడ్డ సాయిబాబా ఆలయంలో సామూహిక సత్యవ్రతాలు చేస్తున్న భక్తులు



శంకరమఠంలో మాట్లాడుతున్న వేదపండితుడు డాక్టర్ యజ్ఞేశ్వర సోమయాజులు

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



మచిలీపట్నం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రూ.45 లక్షల విలువైన 150 ట్రై సైకిళ్లను మంత్రి కొల్లు రవీంద్ర గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ముదావహమన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, గొర్రెపాటి గోపీచంద్, లోగిశెట్టి వెంకటస్వామి, గనిపిశెట్టి గోపాల్, మరకాని పరబ్రహ్మం, కరెడ్ల సుశీల, కార్పొరేటర్ నాగఛాయాదేవి పాల్గొన్నారు.